ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY







# పోరు మొదలైంది!



## ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేడే..

- నేటి నుంచి 25వ తేదీ వరకు కొనసాగనున్న అభ్యర్థుల నామినేషన్లు
- 26న నామినేషన్ల పరిశీలన.. ఉపసంహరణ గడువు ఏప్రిల్ 29
- మే 13న పోలింగ్... జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికారులు
- అటు ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ నియోజకవర్గ కేంద్రాల్లో
- ఎంపీ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ జిల్లా కలెక్టరేట్‌లలో

కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కీలక ఘట్టమైన ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్ తేదీ, ఓట్ల లెక్కింపునకు సంబంధించి అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ జారీచేయనుంది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిందంటే అసలుసిసలు ఎన్నికల వేడి ప్రారంభమైనట్టుగా పార్టీలు భావిస్తాయి. నోటిఫికేషన్ ప్రకారం గురువారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. 26న నామినేషన్ల పరిశీలన చేపడతారు. దాఖలు చేసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు ఏప్రిల్ 29. మే 13న పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అయితే నోటిఫికేషన్ విడుదలైన రోజునుంచే అధికారులు ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ప్రధానంగా అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు ఆ నియోజకవర్గ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి సమక్షంలో నామినేషన్లు దాఖలు చేయాలి. ఎంపీ స్థానానికి పోటీచేసే అభ్యర్థుల నుంచి మాత్రం ఆయా జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ కార్యాలయాల్లోనే నామినేషన్లు స్వీకరిస్తారు. అంటే కాకినాడ జిల్లాకు సంబంధించి కాకినాడ కలెక్టరేట్ లోను, తూర్పుగోదావరి జిల్లాకు రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లోను, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు అమలాపురంలోని కలెక్టరేట్ కార్యాలయంలోనూ ఎంపీ అభ్యర్థులు నామినేషన్లు అందించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కాగా గురువారం నుంచి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అధికారులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు స్వీకరిస్తారు. సెలవుదినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. రెండుకంటే ఎక్కువ నియోజకవర్గాలకు ఒక అభ్యర్థి నామినేషన్లు దాఖలు చేయకూడదు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థితోపాటు అయిదుగురికి మాత్రమే ఆర్వో కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. కాగా జిల్లాలో గురువారం ఎక్కువగా నామినేషన్లు దాఖలు కానున్నాయి. ఆరోజు మంచిరోజు కావడంతో అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు ముహూర్తం నిర్ణయించుకున్నారు.

## నేడు జిల్లాకు జగన్ రాక

- పశ్చిమగోదావరి నుంచి సిద్ధాంతం బ్రిడ్జి దాటి కోనసీమలోని గోపాలపురంలోకి బస్సు యాత్ర
- రాజమహేంద్రవరం మీదుగా రాజానగరం వరకు... రాత్రి బస అక్కడే

రాజమహేంద్రవరం/అమలాపురం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, సీఎం జగన్ గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించ నున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపంలోని తేతలిలో ఉదయం 9 గంటలకు బయలుదేరి సిద్ధాంతం గోదావరి బ్రిడ్జి దాటి కోనసీమ జిల్లా గోపాలపురంలోకి ప్రవేశిస్తారు. అక్కడ నుంచి ఈతకోట, రావులపాలెం, జొన్నాడ, మడికి జంక్షన్, పొట్టిలంక మీదుగా మధ్యాహ్నం 12.30గంటలకు కడియపు లంక చేరుకుంటారు. భోజన విరామం అనంతరం 4 గంటలకు బయలుదేరి బొమ్మూరు జంక్షన్, తాడితోట జంక్షన్, దేవీ చౌక్, సీతంపేట, దివాన్‌చెరువు, రాజానగరం గుండా రోడ్డు షో నిర్వహించి రాత్రి 8.30 గంటలకు రాజానగరం మండలంలోని ఎస్‌టీ రాజాపురం చేరుకొని బస చేస్తారు.

## అనంత.. అరాచకం..



వైసీపీ నాయకుల అరాచకాలకు నిలువెత్తు సాక్ష్యం ఈ ఘటన.. దళితులను ఏం చేసినా మమ్మల్ని ఎవడేం చేస్తాడులే అనే అహానికి నిదర్శనం ఈ ఘటన.. ఇంతకీ ఏమిటా ఘటన అంటే.. దళిత లోకమే నివ్వెరపోయిన విషాద ఘటన.. వైసీపీ పాలనలో అనంత అరాచకాలకు నిలువెత్తు సాక్ష్యం.. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన వద్ద పనిచేసిన దళిత యువకుడైన డ్రైవర్ సుబ్రహ్మణ్యంను 2022 మే 18న నిర్దాక్షిణ్యంగా హత్య చేశాడు.. మమ్మల్ని ఎవడేం చేస్తాడులే అనే ధైర్యం కావొచ్చు.. తన కారులోనే మృతదేహాన్ని తెచ్చి ఇంటి బయట విసిరేశాడు.. నిలదీసిన కుటుంబీకులతో బేరసారాలు నడిపాడు. ఒక దళిత యువకుడి ప్రాణం ఖరీదు ఇంతేనా..!? దళితులంటే ఎందుకింత పగ.. అలాంటి అనంతబాబును వైసీపీ వెనకేసుకొచ్చింది. హత్య కేసు నమోదవ కుండా పోలీసులపై ఒత్తిడి తెచ్చింది. తీరా బాధితులు, పౌర సంఘాలు రోడ్డెక్కడంతో అనంతబాబు అరెస్టు అయ్యారు. విమర్శలకు జడిచి అనంతబాబును వైసీపీ నుంచి సీఎం జగన్ సస్పెండ్ చేశారు. కానీ కొన్ని రోజుల తర్వాత మళ్లీ అనంతబాబును సీఎం జగన్ పక్కన పెట్టుకుని మరీ పర్యటనలు చేస్తున్నారు. సామర్లకోట మునిసిపల్ ఎన్నికల్లో తమపై పోటీకి దిగాడనే అక్కసుతో గిరీష్‌బాబు అనే దళిత యువకుడిని వైసీపీ నేతలు బెదిరించారు. తప్పుడు కేసులతో వేధించారు. దీంతో 2022 జనవరి 6న స్టేషన్‌లోనే బలవన్మరణానికి పాల్పడ్డాడు. తుని నియోజకవర్గం తొండంగి జాతరలో రెండు సామాజిక వర్గాల ఘర్షణలో దళిత యువకుడు నడిపల్లి రాము మృతి చెందాడు. 2020లో సీతానగరంలో వరప్రసాద్ అనే దళిత యువకుడికి పోలీస్ స్టేషన్‌లోనే కొందరు వైసీపీ నేతలు శిరోముండనం చేయించారు. 2019లో కోడికత్తి కేసులో దళిత యువకుడు శ్రీను జైలు పాలయ్యాడు. ఐదేళ్ల పాటు జైలులోనే మగ్గిపోయాడు.. ఇటీవల విడుదలయ్యాడు. 2023లో కొవ్వూరు నియోజకవర్గం దొమ్మేరులో హోం మంత్రి తానేటి వనిత ఇలాకాలో అధికార పార్టీ ఫ్లెక్సీని చించిశాడనే కారణంతో దళిత యువకుడు మహేంద్రను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కడియంలో వైసీపీ నేతల ఇసుక అక్రమాలను ప్రశ్నించిన దళిత నాయకులపై నాన్‌బెయిలబుల్ కేసులు మోపి వైసీపీ నేతలు వేధించారు. ఇలా ఒకటేంటి... వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాలో దళితులపై ఎప్పుడేం ఘోరం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి. మరో పక్క ఉమ్మడి జిల్లాలో ఎక్కడికక్కడ దళితుల భూములపైనా, వారిపైనా పలువురు వైసీపీ నేతలు చేయని దౌర్జన్యం లేదు. పాల్పడని బెదిరింపులు లేవు. వీరంతా న్యాయం కోసం ఐదేళ్లలో ఎన్నోసార్లు ఆయా జిల్లా కలెక్టరేట్లకు న్యాయం కోసం కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నా ఏనాడు వీరికి న్యాయం జరగలేదు. అధికారంలోకి రాక ముందు దళితులపై వైసీపీ కురిపించిన ప్రేమకాస్తా అధికారం వచ్చాక పగగా మారి వారిని వెన్నాడింది. - (కాకినాడ, ఆంధ్రజ్యోతి)

# దళితులపై ఇంత పగా!



సీతానగరం బాధితుడు



వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కారులో డ్రైవర్ మృతదేహం (ఫైల్)

## చంపేసి..డోర్ డెలివరీ

కాకినాడ జిల్లా 2022లో అట్టుడికి పోయింది. తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్‌ను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు మే 18న అర్ధరాత్రి కాకినాడ బీచ్ రోడ్డులో హత్య చేసి మృతదేహాన్ని తన కారులో అనంతబాబు డ్రైవర్ ఇంటికే తీసుకెళ్లాడు. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. తీరా కుటుంబీకులు తిరగబడడంతో డబ్బులు ఇస్తా నోరు తెరవొద్దని బెదిరించాడు. ఆగ్రహంతో బాధితులు నిలదీయడంతో కారు వదిలేసి పారిపోయాడు. మూడు రోజుల తర్వాత హత్య తానే చేశానని పోలీసుల ఎదుట ప్రత్యక్షమయ్యాడు. ముందు అనుమానాస్పద హత్యగా నమోదు చేయడానికి ప్రయత్నించిన పోలీసులు బాధితులు, దళిత సంఘాల ఆందోళనతో హత్య కేసుగా మార్చారు. ఆ తర్వాత అనంత బాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించగా బెయిల్‌పై బయటకు వచ్చారు. అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు జగన్ ప్రకటించారు. అయితే ఆ తర్వాత అనంతబాబును పక్కన పెట్టుకుని వైసీపీ మంత్రులు, సీఎం బహిరంగ సభలకు హాజరవడంతో అంతా నోరెళ్లబెడుతున్నారు.ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గం ధర్మవరం దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి అనంతబాబు పూలమాల వేశాడు. దళితుడిని చంపి అంబేడ్కర్‌ని అవమానించిన వ్యక్తికి దళితవాడల్లో తిరిగే హక్కులేదని నినాదాలు చేస్తూ దళితులు అతడిని తరిమేశారు.

## వైసీపీ ఐదేళ్ల పాలనలో అనంత దారుణాలు

- ఉమ్మడి తూ.గో.జిల్లాలో దళితులపై దమనకాండ
- చేతికి అధికారం కట్టబెడితే దళితులకు ఫ్యాన్ షాక్‌లు
- హత్యలు.. దౌర్జన్యాలు, దాడులు, శిరోముండనాలు



జగన్ రాజకీయానికి బలైన కోడి కత్తి శ్రీను (ఫైల్)



అమలాపురంలో దగ్ధమవుతున్న మంత్రి విశ్వరూప్ నివాసం (ఫైల్)

## తూర్పున రేగిన అశాంతి...



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రశాంతతకు మారుపేరు తూర్పుగోదావరి.. ఇదీ రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్ల కిందటి వరకూ ఉన్న పేరు.. అటువంటి ప్రశాంత తీరంలో వైసీపీ వచ్చాక అశాంతి రాజ్యమేలింది.సీతానగరం మండలం పెదకొండే పూడి లో ఈ ఏడాది ఫిబ్రవరి 2న తనను ఏలుకో మన్న భార్యకు భర్త శిరోముండనం చేశాడు.ఈ ఘటన వెనుక వైసీపీ నాయకులు ఉన్నారంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్నాడనే కారణంతో 2020 జూలై 20న సీతానగరం మండలం మునికూడలిలో ఇండు గుమిల్లి వరప్రసాద్‌ను సీతా నగరం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులు గుండు గీసేశారు.ఈ కేసులో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిందితులకు అండగా ఉన్నట్టు అప్ప ట్లో దళితులు ఉద్యమించారు. బాధితుడు ప్రసాద్ రాష్ట్రపతికి సైతం ఫిర్యాదు చేశాడు.ఈ కేసులో స్థానిక వైసీపీ నాయకుడితో పాటు ఆరుగురు నిందితులుగా ఉన్నారు. దొమ్మేరులోని వైసీపీ వర్గపోరుకు బొంతా మహేంద్ర అనే యువకుడు బలైపోయాడు. హోం మంత్రి వనితకు సంబంధించిన ఫెక్సీలో తలల భాగాలు కత్తిరించి ఉండడంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానితుడిగా మహేంద్రను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కూర్చోబెట్టారు.తన పరువు పోయిందని తీవ్ర మానసిక క్షోభకు గురైన ఆ దళిత యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కౌలు రైతులు కొమ్మరాజు ముత్యాలు, కొమ్మరాజు సత్యనారాయణ వద్ద తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన గెడ్డం శ్రీను పనిచేస్తుండేవాడు. మూడు రోజులు పనివెళ్లకపోవడంతో కౌలు రైతులు వచ్చి అతడిని ఇంటి వద్ద నుంచి తీసుకెళ్లారు.అదే రోజు సాయంత్రం శ్రీను ఆ రైతుల పొలం వద్ద ఒం టిపై నూలుపోగు కూడా లేకుండా నిర్జీవంగా పడి ఉన్నాడు.ఈ కేసులో పోలీ సుల తీరుపై ఎస్సీఎస్టీ కమిషన్ కూడా మండిపడింది.

## పచ్చని కోనసీమలో కులచిచ్చు..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కోనసీమలో కులచిచ్చు పెట్టారు. రెండేళ్ల కిందట కొత్తగా ఆవిర్భవించిన జిల్లాకు నేరుగా అంబేడ్కర్ పేరు ప్రకటించకుండా అటు దళితులు, ఇటు ఇతర సామాజికవాదులు పరస్పరం ఆందోళనలు చేపట్టే వరకూ ప్రభుత్వం వేచిచూసింది. అనంతరం ప్రభుత్వం అంబేడ్కర్ పేరును ప్రకటించడంతో సున్నితమైన ఈ అంశం కుల ఘర్షణలకు దారితీసింది. దాంతో 2022 మే 22న పేరు మార్పును నిరసిస్తూ అమలాపురం కేంద్రంగా హింసాత్మక ఘటనలు జరిగాయి.పోలీసులపై దాడులతో పాటు రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, ముమ్మిడివరం వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్‌ల నివాసాలకు నిప్పంటించి విధ్వంసం సృష్టించారు. ఆనాటి ఘటనలపై అమలాపురం పోలీసులు సుమారు 250 మందికిపైగా విధ్వంసకారులను గుర్తించారు.ఈ ఘటనల తరువాత జిల్లాలో వైసీపీకి తీవ్ర నష్టం జరిగిందని భావించిన సీఎం జగన్ అమలాపురం అల్లర్ల ఘటన కేసులను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించారు. చివరకు వైసీపీకి చెందిన దళిత నేతలే హైకోర్టును ఆశ్రయించి కేసులు ఎత్తివేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను స్టే విధించారు. అయితే దళిత మంత్రి విశ్వరూప్ ఇల్లు తగులబెట్టిన వారిపై కేసులు ఉపసంహరించిన జగన్ ప్రభుత్వ తీరుపై దళిత సంఘాలు ఇప్పటికీ గుర్రుగానే ఉన్నాయి. రాబోయే ఎన్నికల్లో దళితుల నుంచి ఈ ప్రభావం వైసీపీకి గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా.

## జాతర చూసేందుకు వస్తే చంపేశారు..



తొండంగి, ఏప్రిల్ 17: కాకినాడ జిల్లా తొండంగి గ్రామానికి చెందిన రాజు శృంగవృక్షంలో జాతర చూసేందుకు గతేడాది మార్చి 22న తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. ఆ రోజు రాత్రి జాతరలో స్థానిక యువకులతో అతడికి జరిగిన స్వల్ప ఘర్షణ జరిగింది.స్థానిక యువకులు పెద ఎత్తున వచ్చి రామును కొట్టడంతో అతడు మృతిచెందాడు. దీంతో పాటు పలువురు దళిత యువకులకు గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీకి చెందిన వారే యువకుడి మృతికి కారణమయ్యారని వారి పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని దళిత సంఘాలు ఆందోళన చేశాయి. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ దళిత నాయకులు చెపుతున్న పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని పోలీసులను ఆదేశించడంతో మరో ఇద్దరి పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

## 18 మంది దళిత యువకులపై రాజద్రోహం కేసు



రావులపాలెం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్త పేట వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వగ్రామం గోపాలపురం.2022 జూలై 5న గోపాలపురంలోని అన్నపూర్ణ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో టిఫిన్ ప్లేట్లపై అంబేడ్కర్ బొమ్మ ముద్రించి ఉండడాన్ని దళిత యువకులు గుర్తించి యజమానిని ప్రశ్నించడంతో ఘర్షణ జరిగింది. రెండు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పోలీసులపై ఒత్తిడి తేవ డంతో 18 మందిపై రాజద్రోహం కేసు నమోదు చేసి జైలుకు పంపారు.కొద్ది రోజుల తర్వాత గోపాలపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'లో పాల్గొ నేందుకు వెళ్లిన జగ్గిరెడ్డికి వ్యతిరేకంగా దళిత మహిళలు నినాదాలు చేశారు. మా పిల్లలను జైలుకు పంపి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వచ్చారని నిలదీశారు.

## జగన్ రాజకీయ జీవితానికి.. దళితులే సమాధి కడతారు



జగన్ రాజకీయ జీవితానికి దళితులే సమాధి కడతారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక డాక్టర్ సుధాకర్ దగ్గర నుంచీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవరు వీధి సుబ్రహ్మణ్యం వరకూ దళితులపై తీవ్రంగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. దళితులను వంచించడంలో వైసీపీ శక్తివంచన లేకుండా పని చేసింది. జగన్‌కి దళితులు ఓటు అనే ఆయుధంతో గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.

- ముప్పాళ్ల సుబ్బారావు, ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

## తోటకు శిక్ష.. వైసీపీకి షాక్

తోట త్రిమూర్తులు పరిచయం అక్కర్లేని పేరు ఇది.. ఎందుకంటే ఆది నుంచి వివాదాలే.. అటువంటి నాయకుడు ప్రస్తుతం వైసీపీ మండపేట అభ్యర్థిగా బరిలో ఉన్నారు.. 27 ఏళ్ల కిందట ఆయన చేసిన నిర్వాకం తెలిస్తే దళితులు ఆగ్రహంతో ఊగిపోతారు. 1996లో రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన సమయంలో తనకు వ్యతిరేకంగా పనిచేశారన్న ఒకే ఒక్క కారణంతో వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు యువకులను హింసించి.. ఇద్దరికి శిరోముండనం చేయించారు. ఈ కేసులో విశాఖ కోర్టు మంగళవారం తోట త్రిమూర్తులుకు 18 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. దీంతో ఎన్నికల వేళ వైసీపీకి షాక్ తగిలింది.



శిరోముండనం బాధితులు(ఫైల్)



తోట త్రిమూర్తులుతో జగన్





## ఏమి చేశారని.. వస్తున్నారు జగన్!!

- 7లో

- ప్రశ్నిస్తున్న ప్రజానీకం
- ఐదేళ్ల నుంచీ తూర్పుగోదావరిపై చిన్నచూపు
- రాజమహేంద్రవరానికీ ఒరిగిందేమీ లేదు
- పరిశ్రమలు మూత.. పర్యాటకం పడక
- నేడు జగన్ రోడ్ 'షో'

## సుద్ద అబద్ధాలు!

- 6లో

- ఏలేరు దాటి తెప్ప తగలేసిన వైనాలు
- పిఠాపురం నియోజకవర్గానికి జగన్మోసం
- పాదయాత్ర నాటి హామీలన్నీ బూటకమే
- సీఎం హోదాల్లో అన్నీ ఇచ్చేస్తున్నట్టు కలరింగ్

## పులకించిన భద్రగిరి

అన్నవరం, జి మామిడాడల్లో వైభవంగా సీతారామ కల్యాణాలు

- 7లో

## రాములోరి కల్యాణం.. కమనీయం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : భక్తులు పెళ్లి పెద్దలై రాములోరి కల్యాణాన్ని బుధవారం కన్నుల పండువగా చేశారు. శ్రీరామ నవమి శోభతో వాడ వాడలా ఆధ్యాత్మిక సందడి వెల్లివిరిసింది. ముత్యాల పందిరిలో సీతమ్మ మెడలో రాములోరు మాంగల్యధారణ చేశారు. ఈ ఘట్టాన్ని తిలకించిన భక్తకోటి 'జై సీతారామ్' అని నినదిస్తూ మురిసిపోయారు. జిల్లావ్యాప్తంగా సీతారాముల కల్యాణాన్ని భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాజమహేంద్రవరం సీతంపేట రామాలయంలో పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు. జాంపేట రిజర్వు పోలీసు లైనులోని శ్రీ కోదండ రామాలయ ప్రాంగణంలో ఎస్పీ జగదీశ్, ఆయన సతీమణి హేమ సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించి పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు.అనంతరం పానకం, వడపప్పు ప్రసాదం వితరణ చేశారు. అడిషనల్ ఎస్పీలు పి.అనిల్ కుమార్, ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు రఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయి మహేశ్, డీఎస్పీలు,సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సీతంపేటలో పురందేశ్వరి పూజలు

రిజర్వు పోలీస్ లైన్ రామాలయంలో ఎస్పీ దంపతుల పూజలు

## మద్య నిషేధంచేయని జగన్‌కు ఓటు అడిగే హక్కు లేదు : మాలే



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 17: ఎందరో మహిళల తాళిబొట్లు తెగిపోవడానికి కారకుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ బహిరంగంగా మహిళలకు క్షమాపణ చెప్పి అప్పుడు జిల్లాలో అడుగుపెట్టాలని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి డిమాండ్ చేశారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని మాట ఇచ్చి రాష్ట్రంలో చీప్ లిక్కరు, కల్తీ మద్యాన్ని జగన్ ఏరులై పారించాడన్నారు.గత ఎన్నికల ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తేనే మిమ్మల్ని ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్ ఇప్పుడు సిగ్గులేకుండా ఎందుకు మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నావని ప్రశ్నించారు. రోజువారి మద్యం తాగే కూలీలు ఇప్పుడు జే బ్రాండ్ల పుణ్యామంటూ లివర్లు పాడై అనారోగ్యాలతో ఉన్నారన్నారు. మహిళలను ఓట్లు అడిగే హక్కు జగన్‌కు లేదన్నారు. మహిళలను దగా చేసిన జగన్‌కు ఓట్లతోనే బుద్ధిచెబుతామన్నారు. సమావేశంలో తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ద్వారా పార్వతి సుందరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకల నిర్మల, ఈశ్వరి, మీసాల నాగమణి, కానేటి కృపామణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సర్పంచ్‌ల సమస్యలపై సమావేశం

కొవ్వూరు, ఏప్రిల్ 17 : సర్పంచ్‌ల సమస్యలపై ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు బుధవారం తెలిపారు. ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ సర్పంచ్‌ల సంఘం పిలుపుమేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల సమైఖ్య ఆధ్వర్యంలో గురువారం రాజమహేంద్రవరం రివర్ బే హోటల్‌లో ఉదయం 10 గంటలకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అఖిలపక్ష సమావేశం జరుగుతుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేయడమే కాకుండా గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించిందన్నారు.సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలన్నారు.



గొల్లప్రోలు శివారు సూరంపేటకు వెళ్లాలంటే బోటు తప్పనిసరి (ఫైల్)

టీడీపీ ప్రభుత్వం, చంద్రబాబు చేసిందేమీ లేదంటూ అబద్ధాలు అవలీలగా పలికేశారు. మేము అధికారంలోకి రాగానే ఏలేరు, సుద్దగడ్డ, పీబీసీ ఆధునికీకరణ చేపట్టి వరద ముంపు నుంచి శాశ్వత రక్షణ కల్పిస్తామని నమ్మబలికారు. ప్రతిపక్ష నేత హోదాలో పిఠాపురం నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించిన జగన్ ఎన్ని చెప్పాలో అన్ని అబద్ధాలు చెప్పేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ మరిచారు..మోసం పోయామని పిఠాపురం నియోజకవర్గం ప్రజలు అనుకునే సమయానికి ఐదేళ్లు గడిచిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నిర్వహించిన ప్రచార బహిరంగ సభలోనూ జగన్ పిఠాపురం నియోజకవర్గానికి అనేక హామీలు ఇచ్చారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించి మూడు సంవత్సరాలు దాటే వరకూ ఆ హామీలు గుర్తుకు రాలేదు. కాపునేస్తం పంపిణీకి వచ్చిన ఆయన ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి పనులు తామే ప్రారంభిస్తున్నట్లు కలరింగ్ ఇచ్చేశారు. సీన్ కట్ చేస్తే 22 నెలలు గడిచాయి. ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఎన్నికలు వచ్చేశాయి..



216వ జాతీయ రహదారిపై ఏలేరు వరద నీరు (ఫైల్)

# సుద్ద అబద్ధాలు

పిఠాపురం, ఏప్రిల్ 17:

## ఏలేరు దాటి తెప్పతగలెట్టిన వైనాలు

### పిఠాపురం నియోజకవర్గానికి జగన్మోసం



గొల్లప్రోలులో సుద్దగడ్డ వరద ముంపు (ఫైల్)

- ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకీకరణపై బూటకపు మాటలు
- పాదయాత్రలో జగన్ హామీలు గుప్పించేశారు
- ఎన్నికల ప్రచార సభలోనూ అదే మాట
- సీఎం హోదాలో మంజూరు చేసినట్లు కలరింగ్
- ఆచరణలో మాత్రం అంతా రివర్స్
- వైసీపీ ప్రభుత్వంలో జరిగింది గుండు సున్నా..





ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణపై ప్రతిపక్ష నేతగా, సీఎంగా జగన్ చెప్పిన మాటలన్నీ నీటి మీద రాతలుగానే మిగిలాయి. అంతా మేమే చేస్తామన్న కలరింగ్ తప్ప వాస్తవంలో చేసింది ఏమీ లేదు. హామీలన్నీ ప్రకటనలుగానే మిగిలిపోయాయి. అప్పటికే జరిగిన పనులు, పిలిచిన టెండర్లు రద్దు చేయడం మినహా ఒక్క శాతం పనికూడా ముందుకు కదలలేదు. కనీసం అంచనాలు ఆమోదానికి నోచుకోలేదు. మెట్ట ప్రాంతానికి వరప్రదాయినిగా పేరుగాంచిన ఏలేరు రిజర్వాయర్ ద్వారా కాకినాడ జిల్లాలోని పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల పరిధిలో ఉన్న 67,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. విశాఖ స్టీల్ ప్లాంట్లకు ఇక్కడ నుంచే నీరు సరఫరా చేస్తారు. రిజర్వాయర్ నిర్మించిన సమయంలోనే పంట పొలాలుకు సాగునీరు, ఎగువ ప్రాంతాలు నుంచి వచ్చే వరద నీరు సముద్రానికి వెళ్లేలా వరద కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రిజర్వాయర్ ప్రారంభించి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ కాలువల ఆధునికీకరణ జరగలేదు. అధిక వర్షాలు కురిస్తే ఏలేరుతో పాటు సుద్దగడ్డకు భారీ వరదలు సంభవించి భారీ నష్టాలను మిగులుస్తున్నాయి. గత 35 సంవత్సరాల కాలంలో ఏలేరు, సుద్దగడ్డ కాలువలకు సుమారు 52 సార్లు వరదలు సంభవించగా ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రైతులు రూ.920 కోట్లు విలువైన పంటలను కోల్పోయారు. ఆస్తి నష్టం భారీగానే ఉంది. మిగిలిన అన్ని నియోజకవర్గాలతో కలుపుకుంటే ఇది రూ.1300 కోట్లు వరకూ ఉంటుంది. పలువురు వరదల్లో ప్రాణాలు కోల్పోయారు. ఏలేరు, సుద్దగడ్డ కాలువలను ఆధునికీకరించి వరద ముంపు నుంచి పిఠాపురం నియోజకవర్గంతో పాటు ఏలేరు ప్రాంతానికి శాశ్వత రక్షణ కల్పిస్తామని నేతలు హామీలు ఇవ్వడం, అవి కార్యరూపం దాల్చకపోవడం నిత్యకృత్యంగా మారింది. తరచూ వరదలు రావడం, భారీగా ఆస్తి, పంట నష్టాలు జరుగుతున్నా నేతల్లో స్పందన లేకపోవడాన్ని నిరసిస్తూ 2013లో గొల్లప్రోలు పట్టణంలోని ఈబీసీ కాలనీ వాసులు సమస్యను పరిష్కరించకుండా ఈబీసీ కాలనీ వరదను తిలకించడానికి వస్తున్న ప్రజాప్రతినిధులకు ఇదే స్వాగతం, వస్తున్నారు, చూస్తున్నారు, వెళుతున్నారు అంటూ నిరసిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇది జరిగి దశాబ్దం దాటినా పరిస్థితిలో మార్పు లేకపోవడం విశేషం.

### పనులన్నీ టీడీపీ హయాంలోనే

సీఎం హామీలు, మాటలు పరిశీలిస్తే అన్నీ అబద్ధాలు వల్లివేసినట్లు తేలిపోయింది. ఇదే విషయంపై నియోజకవర్గంలో అప్పుడు తీవ్ర చర్చలు జరిగాయి. 2009 అసెంబ్లీ ఎన్నికలకు సరిగా నాలుగు నెలలు ముందు నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఏలేరు ఆధునికీకరణ పనులకు ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో శంకుస్థాపన చేశారు. అది శిలాఫలకానికే పరిమితమయింది. తిరిగి 2014 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే తరహాలో అప్పటి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. పనులు మాత్రం ఒక్క అడుగు ముందుకు కదలలేదు. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.127.58 కోట్లతో ఏలేరు మొదటి విడత ఆధునికీకరణ పనులు చేపట్టి 55 శాతం వరకూ పూర్తి చేశారు. ముఖ్యమైన కట్టడాలన్నీ పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లులు నిలిపివేయడంతో పాటు గతంలో సేకరించిన భూములకు పరిహారం ఇప్పటివరకూ ఇవ్వలేదు. బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు వదిలివెళ్లిపోయారు. దీంతో గత నాలుగేళ్ల పది నెలల కాలంలో ఆధునికీకరణ మొదటి విడతలో ఒక్క శాతం పనికూడా జరగలేదు. ఏలేరు మొదటి విడతతో పాటు ఏలేరు ఆధునికీకరణ ఫేజ్-2లో భాగంగా సుద్దగడ్డ, ఏలేరు కాలువలైన నక్కలఖండి, పెదయేరు ఆధునికీకరణ చేపట్టాలని అప్పటి ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తదితరులు ఒత్తిడి తేవడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.145 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచి ఖరారు చేసింది. ఈ పనులకు 2019 జనవరి 4వ తేదీన సీఎం హోదాలో చంద్రబాబు కాకినాడలో శంకుస్థాపన చేయగా, స్థానికంగా ప్రజాప్రతినిధులు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈలోగా ఎన్నికలు జరగడం, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ పనులను రివర్స్ టెండరింగ్ పేరుతో రద్దు చేశారు. జరుగుతున్న పనులను రద్దు చేసి టీడీపీ ప్రభుత్వంలో ఏమీ జరగలేదన్నట్లు చూపే ప్రయత్నాన్ని జగన్ చేశారు.

### మాటల్లోనే పనులు

ప్రతిపక్ష నేతగా జగన్ 2018 జూలై 31న, గత అసెంబ్లీ ఎన్నికల ముందు 2019 మార్చి 23వ తేదీన పిఠాపురంలో పర్యటించారు. బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణను టీడీపీ ప్రభుత్వం చేయలేకపోయిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టి చూపిస్తామని గొప్పలు చెప్పారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు ముంపు బెడద నుంచి శాశ్వత రక్షణ కల్పిస్తామని, సాగునీటి సమస్య లేకుండా చేస్తామని ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాల రెండు నెలలు వరకూ జగన్ తాను ఇచ్చిన హామీలు గురించి మరిచిపోయారు. 2022 జూలై నెల 28న కాపు నేస్తం సభలో పాల్గొనేందుకు సీఎం హోదాలో మళ్లీ జగన్ వచ్చారు. ఈ సభలోనైనా ఆధునికీకరణపై ప్రకటన చేయకుంటే ప్రజలు నుంచి వ్యతిరేకత వస్తుందని వైసీపీ ప్రజాప్రతినిధులు సీఎం జగన్‌కు మొరపెట్టుకున్నారు. వారి వినతులపై సీఎం ఆర్భాటంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏలేరు ఆధునికీకరణ మొదటి విడత పనుల పూర్తికి రూ.142 కోట్లు, ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు గానూ ఫేజ్-2కు రూ.150 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

### సీఎం హోదాలో ప్రకటించినా అతీగతీ లేదు

ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేపడతామని, నిధులు మంజూరు చేస్తున్నట్లు సీఎం హోదాలో జగన్ ప్రకటించి ఏడాది పది నెలల సమయం గడిచింది. ఒక్క అడుగూ ముందుకు పడలేదు. సీఎం ప్రకటనలకు అనుగుణంగా మిగిలిన ఏలేరు ఫేజ్-1 పనుల పూర్తికి రూ.230 కోట్లు, ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ ఫేజ్-2కు రూ.513 కోట్లు, ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.2 కోట్లు, తిమ్మరాజు చెరువు ఆధునికీకరణకు రూ.7 కోట్లు అవసరమవుతాయని ఇరిగేషన్ అధికారులు 2022 ఆగస్టు నెలలో అంచనాలు తయారు చేశారు. ఇవి సీఎం కార్యాలయానికి చేరి 21 నెలలు గడిచినా వాటికి ఆమోదం లభించలేదు. ప్రజలు తమను ఈ విషయంపై నిలదీస్తున్నారని వైసీపీ ప్రజాప్రతినిధులు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ప్రతిపక్ష నేతగా, సీఎంగా మాటలు కోటలు దాటించిన జగన్ ఆచరణలో మాత్రం మొండిచేయి చూపారని నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు.




ముంపు సమస్య పరిష్కారానికి స్థానికులు వినూత్నంగా నిరసన తెలుపుతున్న దృశ్యం

# ఆ ఊళ్లో అంతా గొల్లపల్లి వాళ్లే!

### ఒకే ఊరిలో 200 కుటుంబాలు



ఎన్నికలు వస్తే కన్ఫ్యూజనే!

అదొక మారుమూల గ్రామం. అక్కడ నివసించే వారంతా వ్యవసాయం, మామిడి తాండ్ర తయారీనే ప్రధాన జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నారు. సాధారణంగా ఏ గ్రామంలో కెళ్లినా, ఏ ఊళ్లో కెళ్లినా పలు రకాల ఇంటి పేర్లతో ప్రజలు ఉంటారు. కానీ కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ నియోజకవర్గం తమ్మవరం గ్రామంలో మాత్రం ఇందుకు భిన్నంగా ఒకే ఇంటి పేరుతో ఎక్కువ కుటుంబాలు ఉండటం విశేషం. సుమారు 200 కుటుంబాలకు పైగా 'గొల్లపల్లి' ఇంటిపేరుతో ఉండటం గమనార్హం. బంధువులు, స్నేహితులు ఎవరైనా ఇక్కడకు వచ్చి సంబంధిత కుటుంబాలను కలుసుకోవాలంటే కత్తిమీద సామే..ఎన్నికలు వచ్చిన ప్రతీసారీ ఓటరు స్లిప్పులు పంపిణీ సమయంలో ఆయా పార్టీల పోలింగ్ ఏజెంట్లు వారికి స్లిప్పులు అందించడంలో నానా ఇబ్బందులకు గురవుతుంటారు. తండ్రి పేర్లు కూడా ఒకే పేరుతో ఉండడంతో ఇక్కడకు వచ్చే వారు విధిగా డోర్ నెంబర్లు పట్టుకుని వస్తేనే సులువుగా గుర్తించవచ్చని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దీంతో పాటు ఉత్తరాలు, నోటీసులు బట్వాడా చేసే పోస్ట్‌మేన్ దగ్గర నుంచి వివిధ రకాల సర్వేలు చేసే అధికారులు వరకు ఒకే రకమైన ఇంటి పేరులతో ఉన్న కుటుంబాలను గుర్తించడంలో అయోమయానికి లోనవుతుంటారు.

సర్పవరం:

కాకినాడ రూరల్ మండలం తమ్మవరంలో పాముగుంట, రుద్రవారి తోట, రామూరి తోట, మార్కండేయ తోట, పోలవరం శివారు గ్రామాలున్నాయి. ఇక్కడ సుమారు 900 కుటుంబాలు నివసిస్తున్నాయి. జనాభా సుమారు 3,500 ఉండగా సుమారు 2700 వరకు ఓట్లు ఉన్నాయి. ఇందులో సుమారు 200 కుటుంబాలకు పైగా అంటే 900 మంది ఇంటి పేర్లు గొల్లపల్లి పేరుతోనే ఉన్నాయి. గొల్లపల్లి సత్తిరాజు, గొల్లపల్లి దొరబాబు, గొల్లపల్లి సతీష్, గొల్లపల్లి పాపారావు, గొల్లపల్లి తాతారావు, గొల్లపల్లి నాగేశ్వరరావు, గొల్లపల్లి సుబ్బారావు, గొల్లపల్లి రమణ, గొల్లపల్లి సూర్యనారాయణ ఇలా ఒకే ఇంటి పేరుతో పేర్లు ఉండటం విశేషం. మాజీ సర్పంచ్ గొలపల్లి సత్తిరాజు పేరుతో ఈ గ్రామంలో సుమారు 25 కుటుంబాలకు పైబడి ఉండటం విశేషం. ఒకే ఇంటి పేరుతో అధిక కుటుంబాలు ఉండటంతో వీరి గుర్తింపులో ఇబ్బందులున్నా, గొల్లపల్లి ఇంటి పేరు అందరి నోటిలో ఉండటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అమ్మో ఆ ఊళ్లో అంతా గొల్లపల్లి వాళ్లే అంటూ అధికారులు దగ్గర నుంచి ప్రజాప్రతినిధుల వరకు పేర్కొనడం ఆనందంగా ఉందని గ్రామ పెద్దలు చెబుతున్నారు.

### మా సొమ్ములు ఎక్కడ..?



డబ్బుల పంపకాల్లో విభేదాలు
గుర్రుగా వైసీపీ కార్యకర్తలు

కొత్తపల్లి, ఏప్రిల్ 17: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో ఎన్నికల హడావిడి ప్రారంభమైంది. ఎప్పుడు డబ్బులు అందుతాయా అని కళ్లలో ఒత్తులేసుకొని ఎదురు చూసే చోటా నాయకులు కొందరికి గత రాత్రి అధికార పార్టీకి చెందిన వ్యక్తులు డబ్బులు పంపిణీ చేశారు. మండలంలో కొందరికి మాత్రమే డబ్బులు పంపిణీ చేయడం, ఈ తతంగం అంతా మండల పార్టీ నాయకునికి తెలియకుండా జరగడంతో వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీ ప్రజాప్రతినిధులపై గుర్రుగా ఉన్నారు. ఈ విషయమై గత అర్ధరాత్రి నడిరోడ్డుపై డబ్బుల పంపిణీకి సంబంధించి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం గమనార్హం. వైసీపీ సర్పంచ్, ఎంపీటీసీలకు నేరుగా డబ్బుల పంపిణీ చేయడాన్ని వైసీపీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.

### వైసీపీకి సినీ నిర్మాత అశోక్‌బాబా రాజీనామా

రాజమహేంద్రవరం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాత, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కొఠారు అశోక్‌బాబా వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి బుధవారం రాజీనామా చేశారు. గురువారం కొవ్వూరులో టీడీపీ నేత పెండ్యాల అచ్చిబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరనున్నారు. చాగల్లుకు చెందిన అశోక్‌బాబా వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. కాని మంత్రి తానేటి వనిత గ్రూపులు పెట్టడం, నియోజకవర్గంలో అభివృద్ధి చేయకపోవడంతో ఆయన పార్టీకి దూరమైనట్టు చెబుతున్నారు. జోరు, తుంటరి వంటి సినిమాలకు నిర్మాతగా వ్యవహరించిన అశోక్‌బాబా, ప్రస్తుతం వెబ్ సిరీస్ ప్లానింగ్‌లో ఉన్నారు. హైదరాబాద్‌లో కన్‌స్ట్రక్షన్ రంగంలో బిజీగా ఉన్నారు. వైసీపీలో ఉండి ప్రజలకు ఏమీ చేయలేని పరిస్థితిలో టీడీపీలో చేరుతున్నట్టు చెప్పారు. ఆయనది మొదటి నుంచి కాంగ్రెస్ కుటుంబం. తండ్రి రామారావు పదేళ్ల పాటు చాగల్లు సర్పంచ్‌గా, సొసైటీ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఆయన పెదతండ్రి మునేశ్వరరావు ఎంపీపీగా కూడా పని చేశారు. అశోక్‌బాబా 2014లో జడ్పీటీసీగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. కానీ 2019లో మంత్రి తానేటి వనిత గెలవడంలో కీలక పాత్ర పోషించారు. చాగల్లులోని సుమారు 20 ఏళ్ల నాడు నిర్మించిన ఇందిరమ్మ కాలనీకి కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అక్కడ గతంలో వచ్చే బస్సు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి, కనీసం రోడ్డు కూడా వేయించలేకపోయానని, అందుకే రాజీనామా చేసినట్టు ఆయన ప్రకటించారు. ఆయనతో పాటు జిల్లా వ్యవసాయ సలహాదారు లకంసాని శ్రీనివాస రావు కూడా రాజీనామా చేశారు.



రాజీనామా పత్రాలను చూపిస్తున్న నేతలు

### మంచి ముహూర్తం కోసం..

అమలాపురం రూరల్, ఏప్రిల్ 17: నామినేషన్లు వేయడమంటే ఆషామాషీ కాదు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో అత్యధికులు తమతమ ఆస్థాన సిద్ధాంతులను కలుసుకుని నామినేషన్లు వేసేందుకు ముహూర్తాలు ఖరారు చేసుకుంటున్నారు. ఎందుకంటే కాలం, కర్మం కూడా కలిసి రావాలని అంటున్నారు. ముహూర్త బలం లేకపోతే దెబ్బతింటామనే భయం ఎందరినో వెంటాడుతుంది. ప్రధానంగా ప్రధాన పార్టీల తరఫున పోటీచేసే అభ్యర్థులు వారివారి జాతకాలను అనుసరించి నామినేషన్లు వేసేందుకు ఇప్పటికే సిద్ధాంతులను, పంచాంగ కర్తలను ఆశ్రయించారు. ఎన్నికల్లో అర్హులైనవారు ఎందరైనా పోటీ చేయవచ్చు. కానీ విజయం సాధించేది మాత్రం ఒక్కరే. ఆ విజయం కోసం ముహూర్త బలం తప్పనిసరి అనేది అభ్యర్థుల నమ్మకం.

#### నామినేషన్లు వేసేందుకు నేటి నుంచే ముహూర్తాలు..



ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు సార్వత్రిక ఎన్నికల నామినేషన్లు వేసేందుకు గడువు నిర్ధారించారు. అయితే మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు నామినేషన్లు వేసేందుకు అనువైన ముహూర్తాలను బండారులంకకు చెందిన ఈశ్వర పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు. ఈ నెల 18వ తేదీన ఉదయం 11.57 గంటలకు, 19న ఉదయం 11.53 గంటలకు, 20న ఉదయం 11.48 గంటలకు, 21న ఉదయం 11.44 గంటలకు, 22న ఉదయం 11 గంటలకు, 11.40 గంటలకు, 23న ఉదయం 11.37 గంటలకు, 24న మధ్యాహ్నం 12.30 గంటలకు, 25న ఉదయం 11.29 గంటలకు నామినేషన్లు వేసేందుకు మంచి ముహూర్తాలుగా ఆయన ప్రకటించారు. నామినేషన్లు వేసేవారు వారివారి తారాబలం సరిపోయిన తేదీల్లో నామినేషన్లు వేయడం మంచిదని సూచించారు.

### బరి తెగించారు..



ప్రచారంలో దేవదాయశాఖ ఉద్యోగి

వైసీపీ ప్రచారంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు..

సామర్లకోట, ఏప్రిల్ 17: సామర్లకోట పట్టణంలో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న సిబ్బంది ప్రభుత్వ వేతనాలు పొందుతూ అధికార వైసీపీకి సేవలు అందిస్తున్నారు. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు. సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో నిత్యాన్నదాన పథకంలో ఉద్యోగిగా పనిచేస్తున్న ఒక వ్యక్తి యథేచ్ఛగా వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు. ఈ ఉద్యోగిపై దేవదాయ శాఖకు, ఎంసీసీ అధికారులకు ఫిర్యాదులు అందినా ఎటువంటి చర్యలు లేకపోవడం గమనార్హం. సామర్లకోట మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఒక వ్యక్తి మున్సిపల్ విధులు చేయకుండా ఒక మున్సిపల్ ప్రజాప్రతినిధి ఇంట, వైసీపీ ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటున్నట్లు పలు ఫిర్యాదులు అందినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఒక అధికారి తన డిప్యూటేషన్ కాలం ముగిసినప్పటికీ తన మాతృ సంస్థకు వెళ్లకుండా వైసీపీ నాయకుని ఇంట పార్టీ కార్యకలాపాలు చక్కబెట్టడం గమనార్హం.






### సీపీఎస్ రద్దు అని చెప్పి వాపస్

రాయవరంలోనే హామీ..

రాయవరం, ఏప్రిల్ 17: ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేస్తామని ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో భాగంగా వైఎస్ జగన్మోహనరెడ్డి ఉద్యోగులకు హామీ ఇచ్చారు. 2018 జూలై 9న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం రాయవరం మండలం రాయవరం గ్రామంలో ఈ హామీ ఇచ్చారు. 209వ రోజు పాదయాత్రలో భాగంగా జగన్ రాయవరం- మహేంద్రవాడ రోడ్డు కూడలిలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యగులు ప్లకార్డులు ప్రదర్శించగా జగన్ తన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ రద్దు చేస్తామని, ఉద్యోగులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జగన్ అధికారంలోకి వచ్చాక సీపీఎస్‌పై కమిటీల పేరుతో కాలయాపన చేసి సీపీఎస్ రద్దు చేయకుండా మాట తప్పారని, ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

బి-ఫారం ఎవరిస్తే

# వారికే పార్టీ గుర్తండోయ్...



- అభ్యర్థిని ప్రకటించగానే పండుగ కాదు..
- బి-ఫారం తెచ్చుకోనివ్వండి చూద్దాం..
- ఎ-ఫారం ఉంటేనే బి-ఫారానికి గుర్తింపు

అమలాపురంరూరల్, ఏప్రిల్ 17: పార్టీ తరుపున అభ్యర్థిగా ప్రకటించారు సరే.. బీ-ఫారం తెచ్చుకోనివ్వండి చూద్దాం.. ఇంకా మాకూ సమయం ఉందనే నాయకులు నేటికీ ఎందరో ఉన్నారు. ఎందుకంటే గతానుభవాలే అందుకు నిదర్శనం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరుపున ఓ అభ్యర్థిని ముందుగా ప్రకటించినా చివరి నిమిషంలో మరో అభ్యర్థికి బీ-ఫారం ఇచ్చిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాగని ఎ-ఫారం లేకుండా బీ-ఫా రం ఇచ్చే అధికారం ఆ పార్టీ అధినేతకు ఉండదు. సార్వత్రిక ఎన్నికల్లో అత్యంత కీలకమైన నామినేషన్ల ఘట్టం ప్రారంభమవుతున్న తరుణంలో బీ-ఫారం గురించి మాట్లాడుకోని నాయకులు ఉండరంటే ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. అసలు ఎ-ఫారం, బీ-ఫారం గురించి తెలుసుకుందాం...

## బి-ఫారం ఎవరికి ఇస్తారంటే..

ఎన్నికలు సమయంలో ప్రధాన రాజకీయపార్టీల తరఫున ఎంపికైన వ్యక్తిని ఆ పార్టీ అభ్యర్థిగా అధికారికంగా ప్రకటిస్తారు. ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ అభ్యర్థులు వీరేనంటూ ఎన్నికల సంఘానికి ప్రతిపాదిస్తూ ఇచ్చేదే బీ-ఫారం. నామినేషన్ సమయంలో అభ్యర్థులు తమ రాజకీయ పార్టీలు ఇచ్చే బీ-ఫారం దాఖలు చేస్తే అతనికి గుర్తింపు పొందిన పార్టీ ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం కేటాయిస్తోంది. అందుకే పార్టీ అధ్యక్షుడు ఎంపిక చేసిన అభ్యర్థికి బీ-ఫారం అందిస్తారు. సాధారణంగా ఎన్నికల బరిలో నిలిచినవారంతా రాజకీయ పార్టీలకు చెందినవారు కాదు. కానీ అభ్యర్థి ఎవరైనా ప్రధాన పార్టీ తరఫున నామినేషన్ వేస్తే ఆ పార్టీ ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. బీ-ఫారం పొందిన వ్యక్తికే ఆ పార్టీ గుర్తును ఎన్నికల సంఘం కేటాయిస్తోంది.

## బి-ఫారం సమర్పించకపోతే..

పార్టీ తరపున నామినేషన్ వేసిన వ్యక్తి సకాలంలో బీ-ఫారం సమర్పించకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తారు. ఆ అభ్యర్థికి ఏదో ఒక గుర్తును కేటాయిస్తారు. ఒక్కోసారి ప్రధానపార్టీ అధ్యక్షుడు ఒకరికంటే ఎక్కువ మందికి బీ-ఫారాలు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే వీరిలో ఎవరు ముందుగా బీ-ఫారం సమర్పిస్తే వారికే పార్టీ గుర్తును కేటాయిస్తారు. ఈనెల 18 నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమవుతుంది. ఈనెల 25వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు ఉంది. ప్రధాన పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ ఎప్పుడువేసినా బీ-ఫారం మాత్రం 25వ తేదీ మధ్యాహ్నం 3గంటలలోపు రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే వారికి ఆయా పార్టీల అధికారిక గుర్తులు లభిస్తాయి. లేదంటే పార్టీ గుర్తు వారికి గల్లంతే.

## పార్టీ అధ్యక్షులకే ఎ-ఫారం..

గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీల అధ్యక్షులకు మాత్రమే ఎన్నికల సంఘం ఎ-ఫారం అందిస్తోంది. ఉదాహరణకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, వైసీపీ అధినేత జగన్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లకు ఎన్నికల సంఘం ఎ-ఫారం అందిస్తోంది. ఎ-ఫారం ఉన్నవారు మాత్రమే తమ పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థులకు బీ-ఫారం ఇచ్చే అధికారం కలిగి ఉంటారు.

# వైభవంగా రాములోరి కల్యాణం

**వధువు సీతమ్మకు సమర్పించిన కంత సారె**



శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో సీతమ్మ అమ్మవారికి కంతసారె

పి.గన్నవరం, ఏప్రిల్ 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం వైనతేయ గోదావరినదీ తీరాన ఉన్న శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రాంబాబు ఆచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిగింది. ఆలయ నిర్వాహకులు గ్రామానికి చెందిన పేరిచెర్ల భీమరాజు, శ్రీమతి వాణి దంపతులు వరుడు రాముడు తరుపున వధువు సీతమ్మకు కంతసారెను సమర్పించారు. కంతసారె, పిండివంటలను ప్రత్యేకంగా తయారు చేసిన చలువపందిరిలో ఏర్పాటుచేశారు. పాలకోవతో తయారుచేసిన పర్ణశాల భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పి.గన్నవరం శివారు భవానీకాలనీ, పితానివారి పాలెంనకు చెందిన చిన్నారులు చేసిన కోలాటం భక్తులను అలరించింది.

## ఏమి చేశారని..

# వస్తున్నారు జగన్!!

- ప్రశ్నిస్తున్న ప్రజలు
- ఐదేళ్ల నుంచీ జిల్లాపై చిన్నచూపు
- రాజమహేంద్రవరానికి ఒరిగిందేమీ లేదు
- నేడు జగన్ రోడ్డు షో

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దగా తప్ప.. బాగుపడ్డ జీవితాలు కనుచూపు మేరలో కానరాని పరిస్థితిని జనం చూశారు. జగన్ సీఎం అయ్యాక స్థానికంగా ఉన్న ప్రధాన సమస్యలపై చర్చించడం మాట తర్వాత సంగతి.. అసలు పట్టించుకున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా తూర్పు గోదావరికి ఆయన 'గాలి' సోకలేదు. జిల్లా కేంద్రమైన రాజమ హేంద్రవ రానిది ఎప్పుడూ అటు రాజకీయంగా.. ఇటు వాణిజ్యపరంగా ప్రధాన స్థానమే. అయినా అభివృద్ధి, నిధుల విడుదలలో తగిన ప్రాధాన్యం దక్కలేదు. నగరపాలక సంస్థ సాధారణ నిధులతో 'షో'కు చేశారు. గ్రా మాల్లో పంచాయతీ నిధులే దిక్కయ్యాయి. కరెంటు బిల్లులు చెల్లించడానికి డబ్బులు లేకపోవడంతో పంచాయతీల్లోని వీధి దీపాలకు, తాగునీటి సరఫరాకు కరెంటును నిలిపివేసే దుస్థితి దాపురించింది. ప్రకృతి వరప్రసాదిని అయిన గోదావరి నది చెంతనే ఉన్నా తాగునీటికి జనావాసాలు కటకటలాడుతున్నాయి. నగరాన్ని పట్టిపీడిస్తున్న డ్రైనేజీ సమస్య అలాగే ఉంది. ఈ పాలకులు చివరికి ట్రాఫిక్‌నీ దారిలో పెట్టలేకపోయారు. శివారు ప్రాంతాల్లో డ్రైనేజీలు, రోడ్లు లేవు. ఈ ఎన్నికల నాటికి మద్యాన్ని దశలవారీగా నిషేధిస్తానని.. లేకపోతే ఓటు అడగనని గత ఎన్నికల్లో చెప్పిన జిల్లాలోని మద్యం అమ్మకాలను నెలకు రూ.100 కోట్లు దాటించారు. 'జే' బ్రాండ్లతో జనం ఆరోగ్యాలను పిండేశారు. ఈ ఐదేళ్లలో ఈ ప్రాంతానికి ఒరిగిందేమీ లేకపోయినా జగన్ మళ్లీ ఓట్ల కోసం రోడ్డు 'షో' నిర్వహించడం విడ్డూరంగా ఉందంటూ ప్రజలు విస్తు పోతున్నారు. ఈసారి పంకాను చెత్తబుట్టలో పడేయడానికి 'సిద్ధం' అంటున్నారు.

**● తూర్పుపై చిన్నచూపే**

తూర్పుగోదావరి జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. వీటిలో ఐదింటిలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉండగా రాజమహేంద్రవరం సిటీ, రూరల్ లో టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నచోట కూడా అభివృద్ధి ఊసు లేకపోగా సిటీ, రూరల్‌లో టీడీపీ ఎమ్మెల్యేలు కావడంతో జగన్ మరీ దారుణంగా ముఖం చాటేశారు. సిటీ, రూరల్‌కి ఇన్నేళ్లలో చెప్పుకోదగిన స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. ఒక్క పెద్ద ప్రాజెక్టు కూ డా చేపట్టలేదు. ఎన్నికలవేళ దగ్గర పడుతుండగా హ డావుడిగా ప్రారంభోత్సవాలు మాత్రం చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాంతంలోని పర్యాటకం గురకపెట్టి నిద్దరోయింది. నగరంలోని గోదా వరి గట్టును కూడా అభివృద్ధి చేయలేకపోయారు. పాత బ్రిడ్జిని పర్యాటక ప్రాంతంగా మారుస్తామనే మాట మరిచి సీరియల్ సెట్ల లైటింగ్‌తో సరిపెట్టారు. పిచ్చుక లంకను మంచి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని టీడీపీ హయాంలో పనులు ప్రారంభించగా వైసీపీ వచ్చాక వాటిని ఆపే శారు. ఆధ్యాత్మికపరంగా ఉమ్మడి తూర్పుగోదావరిలో పురాతన, ప్రాశస్తి కలిగిన పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వాటిని టీడీపీ టెంపుల్ సర్క్యూట్ పేరుతో అభివృద్ధి చేయాలని ఆలోచన చేయగా వైసీపీ వచ్చాక అసలు పట్టించుకున్న దాఖలాలు లేవు.



## నగరంలో ట్రాఫిక్ నరకం



జిల్లాలో ట్రాఫిక్ తలపోటుగా మారి నియంత్రణ కోల్పోయింది. జిల్లా బాస్‌లు నిత్యం సంచరించే జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో మరీ అస్తవ్యస్తంగా మారింది. ట్రాఫిక్ నియంత్రణలో ప్రధాన భూమిక పోషించే సిగ్నల్స్ వెలిగితే వాహనదారుల అదృష్టమనేంత దారుణంగా పరిస్థితి నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తోంది. ఓ వైపు జాతీయ, రాష్ట్ర రహదారులపై బ్లాక్ స్పా ట్స్ జనాల ప్రాణాలను మింగేయడానికి నోర్లు బార్లా తెరుచుకొని చూస్తుంటే.. మరోవైపు నగరాలు/పట్టణాల్లో దారితప్పిన ట్రాఫిక్ వాహనదారులను ప్రమాదాలబారిన పడేస్తోంది. హైవేలో, సిటీలో, పట్టణాల్లో.. ఎక్కడ రోడ్డుపైకి వచ్చినా ఇంటికి క్షేమంగా వెళ్తామన్న గ్యారెంటీ లేదు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపానికి నిధుల లేమి జత చేరడం జనాల పాలిట శాపంగా దాపురించింది. వైసీపీ నాయకులు ప్రచార ఆర్భాటానికి జంక్షన్ల వద్ద అభివృద్ధి పేరుతో చేస్తున్న పనులు రోడ్డును కుచించుకు పోయేలా చేసి ట్రాఫిక్ తిప్పలను ఎక్కువ చేస్తున్నాయనే విమర్శలున్నాయి. ఇప్పుడు జగన్ కాన్వాయ్ వెళ్లే దారులు కూడా వైసీపీ వచ్చాక ఇరుకుగా చేసినవే.

### అభివృద్ధి పేరుతో కుచించి..



ఎక్కడైనా ట్రాఫిక్ పెరిగితే ఇబ్బందులు అధిగమించడానికి రోడ్లు, కూడళ్ల వెడల్పు చేస్తారు. కానీ, జిల్లాలో అందుకు భిన్నంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో రోడ్లు, జంక్షన్లను కుచించుకుపోయేలా చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిపోయాయి. వాటికి అస్తవ్యస్త సిగ్నల్స్ నిర్వహణ మరింత ఆజ్యం పోస్తోంది. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో కంబాల చెరువు, ఐటీ ఆఫీస్ ఏరియాల్లో జంక్షన్ డెవలప్‌మెంట్ పేరుతో చేసిన పనుల వల్ల వాహనదారుల ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. కంబాల చెరువు నుంచి లాలా చెరువు వరకూ ఫుట్‌పాత్‌లపై బిళ్లలు అతికించి పూల కుండీలు ఏర్పాటు చేశారు. దీంతో చిరువ్యాపారులు రోడ్డుపైకి రాక తప్పలేదు. అసలే ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఈ రహదారి ప్రమాదకరంగా మారింది. అన్నట్లు.. ట్రాఫిక్ నియంత్రణలో భాగమైన పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టంలు ఎప్పుడో పడకేసేశాయి.

## గామన్ బ్రిడ్జినీ కుంగదీశారుగా..



మరమ్మతులకు గురైన గామన్ బ్రిడ్జి

వైసీపీ నాయకుల ఇసుకాశవల్ల రాజమహేంద్రవరం సమీపంలోని గోదావరిపై నాలుగో వంతెన(గామన్ బ్రిడ్జి)కు ముప్పు ముంచుకొచ్చింది. కోర్టు తీర్పులను లెక్కచేయకుండా, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు తిలోదకాలిచ్చి గోదావరి నదీగర్భానికి శోకం మిగిల్చి వైసీపీ నాయకులు ఇసుక దందా సాగించారు. గోదావరిలో ఇష్టానుసారం ఇసుక డ్రెడ్జింగ్ చేసి పర్యావరణానికి ముప్పుతెచ్చి వేల కోట్ల రూపాయలు బొక్కేశారు. బ్రిడ్జి స్పాన్(స్తంభం) నుంచి 500 మీటర్ల వరకూ ఇసుక వెలికి తీయకూ డదనే నిబంధనను గోదాట్లో కలిపేశారు. బ్రిడ్జిల స్పాన్లకు సమీపాన ఇసుక తవ్వేయడంతో గామన్ బ్రిడ్జికి ముప్పు వాటిల్లింది. రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలో కూడా ఇసుకను తవ్వేస్తున్నారంటూ రైల్వే పోలీసులు ఓ సారి ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు నివేదించారు.

రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో ఇప్పటికీ వాటర్ ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేసే దుస్థితి ఉంది. టీడీపీ హయాంలో ప్రారంభించిన పరిశ్రమలు వైసీపీ ప్రభుత్వం వచ్చాక మూత పడడంతో సుమారు 50వేల మంది జీవితాలు రోడ్డున పడ్డాయి. ఐదేళ్లపాటు సర్కారీ కొలువులకు ఒక్క నోటిఫికేషన్ కూడా జగన్ ఇవ్వక పోవడంతో యువత అల్లాడిపోతున్నారు. మానసికంగా కుంగిపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తుండగా మెగా డీఎస్సీ పేరుతో దగా నోటిఫికేషన్‌ని ఇచ్చారు. దానిలో జిల్లాకు కేవలం 200లోపు మా త్రమే ఉద్యోగాలు కేటాయించా రు. రాజమహేంద్ర వరంలో రోజుకు సుమారు 80-100 మిలియన్ లీటర్ల మురుగు నీరు ఉత్పత్తి అవుతుంటే.. 30ఎంఎల్ డీ మాత్రమే శుద్ధి చేసే సదు పాయం ఉంది. అది కూడా సవ్యంగా పనిచేసి న దాఖలాలు లేవు. ఈ 4ఏళ్ల 10నెల ల్లో మురుగునీటి శుద్ధి సామ ర్థ్యాన్ని కూడా వైసీపీ పాలకులు పెంచలేకపోయారు.

**● జగన్ వస్తున్న దారిలో..**

జగన్ తన రోడ్డు షోలో భాగంగా జిల్లాలోకి పొట్టిలంక వద్ద ప్రవేశించనున్నారు. అక్కడి నుంచి వేమగిరి వరకూ ఉన్న పువ్వుల నర్సరీలు ఈ ప్రాంతానికి ఖ్యాతి తెచ్చిపెడుతున్న వాటిలో ప్రముఖంగా నిలుస్తాయి. వేలాదిమంది ఈ నర్సరీలపై ఆధారపడి జీవిస్తున్నారు. అలాంటి నర్సరీల కు టీడీపీ హయాంలోనే ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించారు. ఎగుమతులను ప్రోత్సహించారు. అయితే, వైసీపీ ప్రభుత్వం వచ్చాక నర్సరీల కు ఒరిగిందేమీ లేదనే చెప్పొచ్చు. హైవేపై వేమగిరి జంక్షన్ ముఖ్య మైనది. ఇక్కడ నాలుగు ప్రధాన రహదార్లు కలుస్తాయి. ఈ ప్రదేశం అభివృద్ధి మరిచారు. మోరంపూడి జంక్షన్‌లోని ఇప్పుడు జరుగుతున్న ఫ్లైఓవర్ టీడీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పట్లో ఎన్నికలు రావడం.. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడం జరిగి ంది. దీంతో మరింత ఆలస్యమైంది. నాలుగేళ్ల తర్వాత పనులు ప్రారంభ మయ్యాయి. రాజానగరం నియోజకవర్గంలో జూనియర్ కళాశాల హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ఈ నియోజకవర్గంలో అధికశాతం రోడ్లు, డ్రైన్లు టీడీపీ హయాంలోనే పూర్తయ్యాయి. దీంతో హంగు కోసం కొన్ని ప్రారం భోత్సవాలను చేశారు. గత నెల 12న కలవచర్లలో పారిశ్రామికవాడకు కొబ్బరికాయ కొట్టారు. కార్యరూపం ఎప్పుడు దాలుస్తుందో వేచి చూడాల్సిందే.

# కమనీయం.. రత్నగిరి రామయ్య కల్యాణం

● తరించిన భక్తజనం ● ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

అన్నవరం, ఏప్రిల్ 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి ఆలయ క్షేత్రపాలకులైన సీతారాముల దివ్యకల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం 6గంటలకు పండితులు ధ్వజారోహణ, అంకురార్పణ గావించారు. అనంతరం సీతారాములను వెండి ఆంజనేయవాహనంపై, సత్యదేవుడు అనంతలక్ష్మి అమ్మవార్లను వెండిపల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం 10గంటలకు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వార్షికకల్యాణ వేదికపై ఉన్న వెండిసింహాసనంపై నవదంపతులైన సీతారాములను మరో వేదికపై పెండ్లిపెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఆశీనులు గావించారు. ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. నాందీదేవత పఠన అనంతరం గరుడద్విభాగం ఎగురవేశారు. కన్యావరుణలు చేసి సీతమ్మవారితో మంగళగౌరీపూజను జరిపించి ప్రవర పఠించారు. రామయ్యకు సువర్ణయజ్ఞోపవీతాన్ని మంత్రపూర్వకంగా అలంకరింపచేశారు. సుముహూర్త వేళ అభిజిత్ లగ్నంలో సీతారాములు ఒకరి శిరస్సుపై మరొకరు జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. భక్తజన గోవిందనామస్మరణ నడుమ పండితులు మంత్రాలు పఠిస్తుండగా సీతమ్మ మెడలో రామయ్య మూడుముళ్లు వేశారు. అంతకు ముందు ఈవో రామచంద్రమోహన్ పట్టువస్త్రాలను సమర్పించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు పానకం వడపప్పు ప్రసాదాన్ని అందించారు.



రత్నగిరిపై సీతారాముల కల్యాణతంతు నిర్వహిస్తున్న పండితులు

రాత్రి 7గంటలకు పండితు లు నవదంపతులైన సీతారాములకు అరుంధతి నక్షత్రదర్శనం చేయించారు. కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి చిన పట్టాభి, చిట్టెం వాసు తదితరులు నిర్వహించారు.

### నేటినుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠా పూజలు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి ధ్వజస్తంభ ప్రతిష్ఠా పూజలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 11 గంటలకు గణపతిపూజతో ప్రారంభిస్తారు. దీక్షాధారణ, మండపారాధన అనంతరం తొలిరోజున ధ్వజస్తంభంను జలాధివాసంలో ఉంచుతారు. 5రోజులపాటు ఈ పూజలు అనంతరం 22న ప్రతి ష్ఠా కార్యక్రమం నిర్వహిస్తారు. 22న జాతీయరహదారిపై నిర్మిస్తున్న నూతన నమూనాలయంవద్ద సత్యదేవుడు, అనంతలక్ష్మి, శంకరుల రాతి విగ్రహాలును ప్రతిష్ఠించనున్నారు.

# గంటిలో వృద్ధురాలి దారుణ హత్య



గంటిలో హత్యకు గురైన శిరిగినీడి గంటాలమ్మ

కొత్తపేట, ఏప్రిల్ 17: కుటుంబ కలహాల నేపథ్యంలో మండలంలోని గంటిలో శిరిగినీడి గంటాలమ్మ (78) బుధవారం తెల్లవారుజామున దారుణ హత్యకు గురైందని ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. వివరాలు ఇలా వున్నాయి... గంటి గ్రామానికి చెందిన నాగదేవికి 2015 ఫిబ్రవరిలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వైరా మండలం రేప్పవరానికి చెందిన సాధం రామకృష్ణతో వివాహమైంది. అయితే అప్పటికే అతడికి తన మేనకోడలితో వివాహమైంది. ఒక ఆడపిల్ల సంతానం కలిగి తర్వాత తలెత్తిన విభేదాలతో పెద్దల సమక్షంలో విడాకులు తీసుకున్నారు. నాగదేవిని వివాహం చేసుకున్నాక ఇద్దరు మగపిల్లలు పుట్టారు. ఈ నేపథ్యంలో రామకృష్ణ నాగదేవిపై అనుమానంతో తరుచూ వేధింపులకు గురిచేసేవాడు. తమ్ముడు నరేష్‌తో అక్రమ సంబంధం ఉందని అనుమానం వ్యక్తం చేసేవాడు. ఈ నేపథ్యంలో 2022లో తమ్ముడు నరేష్‌ను గొడ్డలితో నరికి చంపాడు. అప్పటి హత్యపై వైరా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన రామకృష్ణ నాగదేవిని కాపురానికి పంపించాలని పెద్దలతో మాట్లాడి... వారి నిర్ణయం మేరకు ఆలమూరు మండలం చెముడులంకలో ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టాడు. అక్కడ కూడా భార్యపై అనుమానం వ్యక్తం చేస్తూ గొడవలు పడేవాడు. దీంతో నాగదేవి ఇద్దరు పిల్లలను తీసుకుని అమ్మమ్మ గంటాలమ్మ దగ్గరకు వచ్చేసింది. 2023 అక్టోబరు 9న రామకృష్ణ గంటి గ్రామం వచ్చి కాపురానికి పంపించే విషయంలో ఘర్షణ పడి నాగదేవి అమ్మమ్మ గంటాలమ్మను కొట్టి ఇంట్లోని సామగ్రిని కాల్చివేసి చంపేస్తానని బెదిరించడంతో రామకృష్ణపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తపేట పోలీసులు రామకృష్ణను అరెస్టుచేసి జైలుకు పంపారు. దీంతో రామకృష్ణ కక్ష పెంచుకుని బెయిల్‌పై వచ్చిన తర్వాత బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు మంచంపై నిద్రిస్తున్న గంటాలమ్మను కత్తితో విచక్షణారహితంగా నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పక్కగదిలో ఉన్న నాగదేవి పిల్లలతో కలిసి బయటకు రాకుండా దాక్కుంది. ఈ రోజు మీ అమ్మమ్మను చంపేశాను... ఏదో ఒక రోజున నిన్ను కూడా చంపేస్తానంటూ రామకృష్ణ నాగదేవిని బెదిరించి పరారయ్యాడు. దీనిపై నాగదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐతోపాటు రావులపాలెం సీఐ రామ్‌కుమార్ పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# వైభవంగా కోదండ రాముడి కల్యాణం

అనపర్తి, ఏప్రిల్ 17: తెలుగు రాష్ట్రాల్లో రెండో భద్రాద్రిగా పేరుగాంచిన అనపర్తి నియోజకవర్గంలోని పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామంలో కోదండ రాముడి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ల నడుమ, వేలాదిమంది శ్రీరామ భక్తుల రామ నామస్మరణ మధ్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. బుధవారం వేకువజామునుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్తల ఇళ్లకువెళ్లి కళ్యాణానికి వినియోగించే తలంబ్రాలను సేకరించి 11గంటలకు సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకీసేవ ద్వారా కళ్యాణ ప్రాంగణానికి తీసుకొచ్చారు. స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఆలయ ధర్మకర్తలు ఈ కల్యాణ మహోత్సవం వేడుకలు స్వామివారికి మొక్కుకోవడం ద్వారా సంతానం కలిగిన తల్లిదండ్రులు తమ చంటి బిడ్డలను స్వామివారికి సమర్పించి, తిరిగి డబ్బులకు స్వామివారి దగ్గరనుంచి వారిని కొనుక్కోవడం ఒక విశిష్ట ఆచారంగా అనాదిగా వస్తోంది. స్వామివారి కల్యాణంలో వినియోగించే తలంబ్రాలను అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రతి తలంబ్రాలు గింజపైన శ్రీరామశ్రీరామ అంటూ లక్ష తలంబ్రాలను సిద్ధం చేయడం అందరినీ ఆకట్టుకుంది. స్వామివారి కల్యాణంలో వినియోగించిన కొబ్బరి బొండాలపైనా శంకుచక్రాలు, స్వామివారి మూలవిరాట్ ప్రతిరూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



జి.మామిడాడ కోదండరాముడి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



# పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

● కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



ఏజెన్సీ సమాచారం

## శ్రీరామగిరిపై వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం దృశ్యం

వరరామచంద్రాపురం, ఏప్రిల్ 17: శ్రీసుందర సీతారామ స్వామివారి కల్యాణాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండో భద్రాదిగా పేరుగాంచిన శ్రీరామగిరి గ్రామం కొండపై స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేలాదిగా తరలివచ్చిన భక్తుల కోలాహలాల నడుమ, మంగళ వాయిద్యాలతో, వేదపండితుల మంత్రోచ్చరణలతో రాములోరి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా ఆలయం నుంచి సీతమ్మ వారిని, రామయ్యను హంస వాహనంపై ఊరేగించి కల్యాణ మండపానికి తీసుకవచ్చి కొలువుదీర్చారు. అనంతరం అర్చకులు స్వామివారికి, సీతమ్మకు విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీక్రోధినామ సంవత్సర చైత్రశుద్ధ నవమి బుధవారం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు అభిజిత్ ముహూర్తాన భక్తుల రామనామ స్వరాలతో, వేద పండితుల మంత్రాల నడుమ శ్రీసుందర సీతారామ స్వామివారి కల్యాణ మహోత్సవం జరిగింది. ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఏఎస్పీ రాహుల్‌మీనా, డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎటపాక సీఐ రామారావు నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, పూనెం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

మోతుగూడెం, ఏప్రిల్ 17: చింతూరు మండలం మోతుగూడెంలో రామాలయాలు వద్ద శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కోదండ రామాలయంలో అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యమోహన్‌రావు దంపతులు పీటలపై కూర్చుని స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ దంపతులు, సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వర రావు, జెన్కో ఉద్యోగస్తులు పాల్గొన్నారు. భక్తులు ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరసింహమూర్తి, చంద్రశేఖర్, కొట్టు శ్రీను, కాంట్రాక్టర్, కార్మికులు పాల్గొన్నారు.

**వై.రామవరం:** శ్రీరామనవమి సందర్భంగా బుధవారం వై.రామవరం మండలంలో పలు రామాలయాల్లో నవమి వేడుకలు వైభవంగా జరిపారు. వై.రామవరం బస్‌సెంటర్, వాల్మీకి వీధి రామాలయాల్లో, యార్లగడ్డ, పి.యర్రగొండ, పనసలపాలెం, చవిటిదిబ్బలు, దాలిపాడు తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. సీతారాములవారి కల్యాణ మహోత్సవాలను పలువురు తిలకించారు. ఆయాచోట్ల పానకాలు, పులిహోర ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. వై.రామవరం వాల్మీకి వీధిలోని సీతారాములను పల్లకీలో ఊరేగించారు.

**దేవీపట్నం:** మండలంలో రాములోరి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి ఆలయాలను పచ్చని పందిళ్లు, విద్యుద్దీపాలతో అలంకరించి బుధవారం కల్యాణం నిర్వహించారు. అనంతరం పానకం, ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. నేలకోట సమీపంలోని కొండపై వెలసిన శ్రీరామదుర్గం ఆలయానికి మైదాన ప్రాంతాల నుంచి సుమారు ఐదువేల మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ముంపు గ్రామాలైన పాతూరు దేవీపట్నం, సీతారం గ్రామాల్లో రాములోరి కల్యాణాన్ని నిర్వహించారు.

## ఉష్ణ గుండాల బావి దర్శనం



ఉష్ణ గుండాల బావి వద్ద భక్తులు

ఎటపాక, ఏప్రిల్ 17: ఎటపాక మండలం గుండాల సమీపంలోని గోదావరి నదిలో ఇసుక తిన్నెల్లో ఉన్న ఉష్ణగుండాల బావిని రామభక్తులు దర్శించుకున్నారు. ప్రతీ ఏటా శ్రీరామనవమి సందర్భంగా రామ భక్తులు తొలుత ఉష్ణ గుండాల బావిని దర్శించుకోవడం ఆనవాయితీ. శ్రీరామ నవమి పర్వదినం రోజున ఈ ఉష్ణగుండాల బావిలో వేడి నీళ్లు రావడం ప్రత్యేకత. శ్రీరామనవమిని పురస్కరించుకుని బుధవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి బావిని దర్శించుకున్నారు. ఆ బావిలోని వేడి నీళ్లను తలపై చల్లుకుని, కుటుంబ సభ్యులు, బంధువుల కోసం బాటిళ్లు, సీసాల్లో వెంట తీసుకెళ్తారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉష్ణ గుండాల బావి వద్ద భక్తులతో సందడి నెలకొంది.

## విద్యార్థిని చితకబాదిన టీచర్

### ఏకలవ్య పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు

రాజవొమ్మంగి ఏప్రిల్ 17: తన బట్టలు ఉతకలేదని ఏకలవ్య పాఠశాలలో విద్యార్థిని ఓ ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు బుధవారం రాత్రి పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాల భవనాల్లోనే అడ్డతీగల ఏకలవ్య పాఠశాలను కూడా నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన అడ్డతీగల ఏకలవ్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముర్ల శ్రీరామ్ రెడ్డిని తెలుగు ఉపాధ్యాయుడు అయిన శివకుమార్ తన బట్టలు ఉతకమని చెప్పడంతో దానికి శ్రీరామ్ రెడ్డి నిరాకరించాడు. దీంతో శివకుమార్ ఆగ్రహంతో శ్రీరామ్‌ను మోకాళ్ల వేయించి కొట్టాడు. కాకినాడలో ఉన్న విద్యార్థి తల్లిదండ్రులు బుల్లబ్బాయిరెడ్డి, సత్యవేణికి విషయం తెలియడంతో ఏకలవ్య పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. ఉపాధ్యాయుడు శివ కుమార్‌ను సస్పెండ్ చేయలంటూ పాఠశాల ఎదుట కూర్చొని తల్లిదండ్రులు నిరసన తెలియజేసారు. శ్రీరామ్ రెడ్డి ఒంటిపై దెబ్బలు తగ్గకపోవడంతో తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. శ్రీరామ్ రెడ్డి తండ్రి బుల్లబ్బాయి రెడ్డి మాట్లాడుతూ తాను అడ్డతీగల ఏకలవ్య పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ అని తన కుమారుడికే ఇలా జరిగితే మిగిలిన విద్యార్థుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. తెలుగు ఉపాధ్యాయుడు శివకుమార్ తమతో బట్టలు ఉతికించే వాడని, మసాజ్ చేయించుకునే వాడని పాఠశాలలో కొందరు విద్యార్థులు తల్లిదండ్రులకు, మీడియాకు తెలిపారు. ఘటనపై అడ్డతీగల ఏకలవ్య ప్రిన్సిపాల్ ఫణికుమార్ మాట్లాడుతూ సంబంధిత ఉపాధ్యాయుడిని ఐటీడీఏ పీవోకు సరెండర్ చేస్తామని వెల్లడించారు.

## వైసీపీ పాలనలో చేనేత రంగం నిర్వీర్యం : గోరంట్ల



దుళ్ళలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థిగోరంట్ల

కడియం, ఏప్రిల్ 17: చేనేత రంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల, ఎంపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి కుమారుడు హితేష్‌లు బుధవారం కడియం మండలం దుళ్ళలో టీడీపీ, జనసేన, నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ చేనేత సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వదిలేసిందన్నారు. చేతకాని పాలన వలన చేనేత సొసైటీలు నష్టపోయాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు వెలుగుబంటి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, మార్గాని సత్యనారాయణ, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, గుర్రపు సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, ప్రత్తిపాటి రామారావుచౌదరి, యర్రా సత్యనారాయణ, ఆకుల శ్రీధర్, గుత్తి సత్యనారాయణ, తూము శ్రీను, మెర్ల అయ్యప్ప, పుత్సల బసవశంకరం తదితరులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 17: దివాన్‌చెరువు సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల నిమిత్తం 11 కేవీ ఫీడర్లకు శుక్రవారం ఉదయం 6నుంచి 10 గంటలవరకూ విద్యుత్‌సరఫరా నిలుపుదల చేయనున్నట్లు రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు దాట్ల శ్రీధరవర్మ బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. దివాన్‌చెరువు, పాలచర్ల, శ్రీరాంపురం గ్రామాలకు, ఈ ఉపకేంద్రం పరిధిలోని వ్యవసాయబోర్లుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ అసౌకర్యాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.



సీతంపేటలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



రూరల్‌లో శ్రీరామనవమి వేడుక నిర్వహిస్తున్న అర్చకుడు



వీరవరంలో రథోత్సవం దృశ్యం





స్వామివార్లను దర్శించుకుంటున్న ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, భవాని దంపతులు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు

## కల్యాణం...కమనీయం

### కన్నుల పండువగా సీతారాముల కల్యాణం
### వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు

రాజమహేంద్రవరంకల్చరల్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి సందర్భంగా రాజమహేంద్రవరం 2 డివిజన్‌లో గోపాల్‌నగర్‌లో రామాలయం వద్ద స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అల్లాడ రాజేశ్వరరావు, సురేఖ, విన్నకోట రాజేష్ శివాంబిక దంపతులు పీటలపై కూర్చొని కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో నారాయణపురం, వెంకటరామయ్యనగర్ తదితర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ భక్తులకు ప్రసాదం, పానకం వితరణ చేశారు. కాగా శ్రీరామ నవమి ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. అలాగే శివజ్యోతి థియేటర్ ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద గోకవరం బస్టాండ్ చైతన్య టాక్సీస్టాండు ఓనర్స్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ విశ్రాంతి ఉద్యోగి ఎం.కృష్ణమాచార్యులు పర్యవేక్షణలో సీతారాముల కల్యాణం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేసి, పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర ట్రావెల్స్ అధినేత బాబీ, బండి సోమయాజులు పాల్గొన్నారు.

**రాజమహేంద్రవరం సిటీ:** రాజమహేంద్రవరంలో జరిగిన సీతారాముల కళ్యాణోత్సవాలలో కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసీతారాముల దివ్య ఆశీస్సులు రాజమహేంద్రవరం ప్రజలపై ఉండాలని వేడుకున్నారు.

**రాజమహేంద్రవరం అర్బన్:** అయోధ్య రాముడి అనుగ్రహం, చల్లని చూపులు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలపైనా ఉండాలని కోరుకుంటున్నానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందరేశ్వరి అన్నారు. తెలుగు ప్రజలకు ఆమె శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సీతంపేట రామాలయంలో శ్రీరామ కల్యాణంలో పురందేశ్వరి పాల్గొన్నారు. అనంతరం పుష్కరఘాట్, కంబాలచెరువు, లాలాచెరువులోని రామాలయాలను సందర్శించి కల్యాణ మహోత్సవాలను తిలకించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దత్తు, రేలంగి శ్రీదేవి, కాశీ విశ్వనాథ్, పడాల నాగరాజు, వంకాయల వెంకటరావు, కాలెపు సాయిరామ్ పాల్గొన్నారు.

**బిక్కవోలు:** బలభద్రపురంలోని నడివీధి, కాలువవీధి, చెరువు వీధుల్లో రామాలయాల్లోని సీతారాములను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆది లక్ష్మి దంపతులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బిక్కవోలులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు చిరువూరి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఒబిలినేని రాజ్‌కుమార్ దంపతులు కళ్యాణ కర్తలుగా వ్యవహరించి సీతారాముల కల్యాణం జరిపించారు. ఊలపల్లి, పందలపాక, ఆరికరేవుల, మెళ్లూరు, కొమరిపాలెం, కొంకుదురు, ఇళ్లపల్లి, రంగాపురం గ్రామాల్లోని రామాలయాల్లో ఘనంగా సీతారాముల కల్యాణం నిర్వహించి పానకం ప్రసాదంగా అందించారు.

**కడియం:** వీరవరంలో శ్రీకోదండ రామస్వామి ఆలయంలో శ్రీరాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. రామయ్యతండ్రి పెళ్లి కొడుకై, సీతమ్మ తల్లి పెళ్లికూతురై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం జరిగింది. భక్తులకు పానకాలు, ప్రసాదాల వితరణ జరిగింది. సుమారు 20 వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు.

**రాజమహేంద్రవరంరూరల్:** రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. తొర్రేడులో సుమారు శతాబ్ద కాలంనాటి రామాలయంలో శ్రీరామనవమి జరిగింది. స్వామివారికి విశేష పూజలు, కళ్యాణమహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఆలయ ప్రాంగణం ఆవరణలో స్వామి వారి కళ్యాణాన్ని నిర్వహించారు.

**రాజానగరం:** చక్రద్వారబంధం రామాలయంలో గ్రామ పురోహితులు భవానీభట్ల సుబ్రహ్మణ్యశర్మ వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. స్థానిక శ్రీషిర్డీ సాయిబాబా సన్నిధిలో శ్రీరామ నవమి కళ్యాణోత్సవాలను కన్నుల పండువుగా జరిపించారు. మండల కేంద్రమైన రాజానగరంలోని కంచుపట్ల వారి రామాలయంలోనూ, రావులచెరువు గట్టున ఉన్న కోదండ రామాలయంలో, అగ్రహారం రామాలయం వద్ద శ్రీరామా నవమి ఉత్సవాలను కన్నుల పండువుగా నిర్వహించారు. మండలంలో రాధేయపాలెం, కానవరం, పల్లకడియం, కలవచర్ల, వెలుగుబంద, నరేంద్రపురం, నందరాడ గ్రామాలతోపాటు జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఉత్సవాలను ఘనంగా జరిపించారు.

**దివాన్‌చెరువు:** దివాన్‌చెరువులోని ఆగమాశ్రమంలో ఉన్న హనుమత్ సమేత కోదండరామస్వామికి కల్యాణోత్సవం, సాయంత్రం పవళింపుసేవ నిర్వహించారు. స్థానికంగా ఉన్న గొల్లల రామాలయంలోను, శ్రీరాంపురంలోని కోదండ రామాలయంలోనూ, పాలచర్ల, శ్రీకృష్ణపట్నం, పాతతుంగపాడు, కొత్త తుంగపాడు, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, తదితర గ్రామాలలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు ఆయా ఆలయాలవద్ద పానకాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. సేవా ఉగాది ఆధ్వర్యంలో దివాన్‌చెరువులో నాలుగుచోట్ల దాతల సహకారంతో బుధవారం చలివేంద్రాలు ప్రారంభించారు. ఈ చలివేంద్రాలలో తొలిరోజు పానకం పంపిణీ చేశారు. వీటి సంరక్షణను సమీపంలోని దుకాణాల వారికి అప్పగించినట్లు సేవా ఉగాది కార్యకర్తలు తెలిపారు. కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సహాయాచార్యులు తలారి వాసు, స్థానికులు ముక్కవల్లి వాసు, గ్రంధినానబ్బులు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### రామాలయానికి వెండి శఠగోపం బహూకరణ

**సీతానగరం:** సీతానగరంలోని దేవదాయ శాఖకు చెందిన కోదండ రామాలయానికి సీతానగరం ఆర్యవైశ్య సంఘం వెండి శఠగోపం బహూకరించగా పెదపల్లి సూరాబాబు వెండి కళ్లు బహూకరించారు. ఆలయ అర్చకుడు రమేష్ బాబు నాలుగు జంటలతో శ్రీసీతారాములు కల్యాణం నిర్వహించారు.

**అనపర్తి:** అనపర్తి మండలంలో పలు రామాలయాల్లో జరిగిన కళ్యాణ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు పాల్గొని కళ్యాణ మహోత్సవాలను తిలకించారు. అనపర్తిలోని శేషగిరిరావు పేటలో సాయిరామ్ మందిర్‌లో జరిగిన వేడుకలలో భక్తులు పాల్గొన్నారు. సత్తి పోతారెడ్డి రామాలయం, బాపి రాజు రామాలయం, పల్లీల రామాలయం, పంచాయతీ రామాలయంలో వర్తక సంఘం ఆధ్వర్యంలోను కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

**గోకవరం:** మండలంలోని అన్ని గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే రామా లయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పానకాన్ని ప్రసాదంగా అం దజేశారు.

**కోరుకొండ:** మండలంలోని 22 గ్రామాల్లోను 96 రామాలయాలు వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉద యం నుంచి రామాలయాలు భక్తులతో పోటెత్తాయి. మండల ప్రధాన కేంద్రం కోరుకొండ హరేరామ సమాజం వద్ద జరిగిన నవమి వేడుకల్లో కపిలవాయి భాస్కర వెంకట లక్ష్మినరసింహం దంపతులు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కోదండ రామాలయం వద్ద శ్రీ లక్ష్మినరసింహస్వామి వారి సన్నిధిలో రామకోటి స్థూపం వద్ద మరంగంటి వారి రామాలయం, గరగవారి రామాలయం, పశ్చిమగోనగూడెం, జంబుపట్నం, నర్సాపురం, గాదరాడ, కణుపూరు, శ్రీరంగపట్నం, కోటి, రాఘవాపురం, బూరుగుపూడి తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు.

## బత్తుల విజయం ఖాయం: బీవీఆర్ చౌదర్



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న రాజానగరం ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి, బత్తుల వెంకటలక్ష్మి

సీతానగరం, ఏప్రిల్ 17: వచ్చే ఎన్నికలలో రాజానగరం నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ విజయం ఖాయమని తెలుగుదేశం రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. బుధవారం ఆయన జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకట లక్ష్మితో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీలు సమన్వయంతో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పెందుర్తి అచ్చుత రామారావు, వలవల రాజా,దూలం కృష్ణ ,గెడ్డం తిమ్మారావు, గంటా రామకృష్ణ, కోటేశ్వరరావు, రామకృష్ణ జనసేన నాయకులు వీరమహిళలు పాల్గొన్నారు

## ఫారం-12 సేకరణ కేంద్రాలు ఏర్పాటు

రాజానగరం, ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా నియోజక వర్గ పరిధిలో నియమితులైన అధికారులు తమ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకునేందుకు తహశీల్దార్ కార్యాలయాల్లో ఫారం-12 సేకరణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు రాజానగరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.చైత్రవర్షిణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజానగరం నియోజకవర్గంలో ఎన్నికల విధులకు కేటాయించిన ఇతర పోలింగ్ అధికారులు(ఓపీవో), సూక్ష్మపరిశీలకులు(మైక్రో అబ్జర్వర్లు)రాజానగరం, కోరుకొండ, సీతానగరం తహశీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ సేకరణ కేంద్రంలో ఫారం-12ను పూర్తి చేసి, ఎన్నికల ఉత్తర్వుల కాపీ జిరాక్స్ రెండు తాజా పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను ఈ నెల 22లోగా అందజేయాలని చైత్రవర్షిణి ఈసందర్భంగా తెలియజేశారు.

## 16 మంది వలంటీర్లు రాజీనామా

రంగంపేట, ఏప్రిల్ 17: మండలంలోని వెంకటాపురంలో బుధవారం 16 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. సీఎం జగన్ తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థను ఐదేళ్లుగా నిస్వార్థంగా వేతనంతో సంబంధం లేకుండా సీఎం వలంటీర్స్‌పై పెట్టిన బాధ్యతను నెరవేరుస్తూ పనిచేశామన్నారు.

## త్రుటిలో తప్పిన ప్రమాదం

సీతానగరం, ఏప్రిల్ 17: స్థానికులు, విద్యుత్ సిబ్బంది అప్రమత్తం కావడంతో తృటిలో ప్రమాదం తప్పింది. మండల కేంద్రమైన సీతానగరంలోని శివాలయం వద్ద ఒక చెట్టుకొమ్మ విరిగి 16 కేవీ విద్యుత్ లైన్‌పై పడడంతో విద్యుత్ వైర్లు తెగి కిందపడ్డాయి. దీంతో స్థానికులు అప్రమత్తం కావడంతో రాకపోకలు నిలువరించి విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో తక్షణం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రమాదం తప్పింది.

## ఆదరించండి..అండగా ఉంటా

గోకవరం, ఏప్రిల్17: రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రతీ ఒక్కరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని వెదురుపాక గ్రామంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ వీధిలో తిరిగి జగ్గంపేట కూటమి అభ్యర్థిగా తనను, కాకినాడ ఎంపీగా తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా నెహ్రూ మహిళలు అడుగడుగునా హారతులు పట్టారు. ఆయన వెంట అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజమహేంద్రవరం అభివృద్ధికి చేసిందేమీ లేదు

- జగన్.. ఏ ముఖంపెట్టుకుని జిల్లాలోకి అడుగుపెడుతున్నావ్
- ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు నీకు లేదు
- మిల్లు కార్మికులకు ద్రోహం చేయడంలో తెరవెనుక చిత్రకారుడు భరత్
- టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 17: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాజమహేంద్రవరం నగరానికి చేసిందేమి లేదని, సంపూర్ణ మద్యపాన నిషేదం చేసి 2024 ఎన్నికలకు వెళ్తామన్నా సీఎం జగన్ ఏ ముఖం పెట్టుకుని జిల్లాలోకి అడుగుపెడుతున్నావని టీడీపీ-జనసేన-బీజేపీ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రశ్నించారు. స్థానిక తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గులకరాయి డ్రామా పూర్తి చేసుకున్న జగన్ రాజమహేంద్రవరం వస్తున్నాడని, సీఎం జగన్ నగర ప్రజలకు అభివృద్ధి పరంగా సంక్షేమ పరంగా ఏమి చేశారని ఓట్లు అడిగేందుకు వస్తున్నాడని ప్రశ్నించారు. నగర అభివృద్ధి ప్రత్యేక గ్రాంట్ ఏమిచ్చారు ? మీరు ఇచ్చింది రూ.5 కోట్లే మిగిలింది కార్పొరేషన్ నిధులేనన్నారు. ఎన్నికల ముందు చాలా వాగ్దానాలు చేశారు. స్టేడియం కడతామన్నారని, సుందరీకరణ పేరుతో 25శాతం కమిషన్ దోచేశారన్నారు. చాళుక్యులకు రాజధానిగా ఉన్న రాజమహేంద్రవరాన్ని గంజాయికి కేంద్రంగా, బ్లేడు బ్యాచ్‌లకు అడ్డాగా మార్చేశారన్నారు. ఇప్పుడు ఎన్నికల ఓట్లు అడగటానికి వస్తున్నారని, ఓట్లు అడిగే నైతిక హక్కు జగన్‌కు లేదన్నారు. సారా, కల్తీ మద్యాన్ని పెంచి పోషించారని ఢిల్లీ లిక్కర్ స్కామ్ కంటే పెద్ద స్కామ్ ఏపీలో చేశారని మండిపడ్డారు. గోదావరి ఇసుకను పంది కొక్కుల్లా మేసేశారని వీరి దెబ్బకు గామన్ బ్రిడ్జి స్తంభం కుడా కుంగిపోయిందన్నారు. ఆవ భూముల్లోను దోచుకున్నారని మొత్తంగా రూ.900 కోట్లు దోచేశారని అన్నారు. వీటన్నింటికి సీఎం జగన్ సమాధానం చెప్పాలని, ఏమి చెప్పకుండా ఎప్పటి మాదిరిగానే తమ అభ్యర్థులను పక్కన పెట్టుకుని 'మా అభ్యర్థులు అంతంత మాత్రమే' అని అంటే ప్రజలు నవ్వుకుంటారని అన్నారు.

### వేతన ఒప్పందాలు చేయడం లేదు

2020-23 కాలపరిమితికి జరగాల్సిన వేతన ఒప్పందం జరుగకుండా యాజమాన్యం ఉద్దేశపూర్వంగా కాలయాపన చేస్తోందని ఆదిరెడ్డి వాసు మండిపడ్డారు. చట్టబద్ధమైన కోరికలు వేత ఒప్పందాలు చేయడం లేదని, గుర్తింపు సంఘానికి జరగాల్సిన ఎన్నికల జరపడం లేదని కార్మికులు కార్మిక శాఖను, యాజమాన్యాలను ప్రతివాదులుగా చేర్చి కోర్టులో కేసులు వేసారని ఆదిరెడ్డి పేర్కొన్నారు. అయితే యాజమాన్యం కోట్లు ఖర్చుచేసి కోర్టుకు వెళ్తోందని, కాని కార్మికులను న్యాయం చేయడంలేన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి కూడా మిల్లును కార్మికులు నడిపించారని, అటువంటి కార్మికుల పట్ల మొండి వైఖరి అవలంబిస్తున్నారన్నారు. రోజుకు రూ.2 కోట్ల లాభాలను కార్మికుల రక్తాన్ని చేమటగా చేసి లాభపడుతుందన్నారు. యాజమాన్య ఎన్నడు లేని విధంగా వ్యవహరిస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్మికులకు న్యాయం చేయగలిగామని కాని ఐదేళ్లలో మిల్లు కార్మికులను మోసం చేశారని చెప్పారు. అక్కడ ఉన్న కొంతమంది అధికారుల అత్యుత్సాహం వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఎంపీ భరత్ రామ్ యాజమాన్యానికి కొమ్ము కాసి కార్మికుల ఉద్యమాన్ని అణ వేస్తున్నారన్నారు. ఎంపీ భరత్‌రామ్ అనుచరుడు ప్రవీణ్ చౌదరి కూడా కార్మికుల ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నారని కార్మికులే అంటున్నారన్నారు. కార్మికులకు న్యాయం జరుగకుండా యాజమాన్యానికి తెరవెనుక నుంచి సహకరిస్తున్నన్న చిత్రకారుడు భరత్‌రామ్ అని ఆదిరెడ్డి వాసు మండిపడ్డారు. కార్మికశాఖతో తాము మాట్లాడుతున్నామన్నారు. కార్మికులకు టీడీపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. 2020-23 వరకు కార్మికులకు జరిగిన వేతన ఒప్పందం చేయాలనే డిమాండ్స్‌ను నేరవేర్చాలన్నారు. ఇక్కడ ఉన్న పరిశ్రమ ఒక్కటే కాబట్టి తాము చాలా ఓర్పుతో ఉన్నామన్నారు. 30 రోజుల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని, కార్మికులు డిమాండ్‌లను పరిష్కారింపజేసి మంచి అగ్రిమెంట్ చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయ్యల రమణ, మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ, టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, ఉమామార్కండేశ్వరాలయం చైర్మన్ యిన్నమూరి దిపు తదితరులు పాల్గొన్నారు.

### నేడు కూటమి అభ్యర్థి శ్రీనివాస్ నామినేషన్
#### తిలక్ రోడ్డులోని సాయిబాబా ఆలయం నుంచి ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్ గురువారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు వివరాలను ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 8:30గంటలకు స్థానిక తిలక్‌రోడ్డులోని సాయిబాబా ఆలయం నుంచి బయలుదేరి జేఎన్ రోడ్డు, ఏవీఏ రోడ్డు, గోరక్షణపేట మీదుగా అన్నపూర్ణంపేట స్వామి థియేటర్ వద్దకు చేరుకుంటామని, అక్కడ తమ కూటమి కార్యకర్తలతో కలిసి అజాద్ చౌక్, జాంపేట, దేవిచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆర్వో కార్యాలయానికి చేరుకుని పెద్దలు, తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతల సమక్షంలో నామినేషన్ దాఖలు చేస్తానని ఆదిరెడ్డి శ్రీనివాసు చెప్పారు. రాజమహేంద్రవరం ప్రజలు తనను ఆశీర్వాదించాలని విజ్ఞప్తి చేసారు.

## శ్రీరామనవమి వేడుకలు
### స్వామివారిని దర్శించుకుని ఆదిరెడ్డి దంపతులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 17: రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని సాయిబాబా ఆలయంలో బుధవారం జరిగిన శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తొలి మహిళామేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ దంపతులు, వారి కుమార్తె అపర్ణ పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ స్వామి అమ్మవార్ల ఆశీర్వాదంతో కూటమి అధికారంలోకి రావాలని, నగర ప్రజలు సంతోషంగా వుండాని నగరం అన్ని రంగల్లో అభివృద్ధి సాధించాలని కోరుకున్నట్టు చెప్పారు.





# నిఘా బృందాలు సమష్టిగా పనిచేయాలి

### రాజమహేంద్రవరం సిటీ ఆర్వో దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 17: నిఘా బృందాలు సమష్టిగా పని చేయాలని రాజమహేంద్రవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.దినేష్‌కుమార్ అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన తనిఖీ బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 18నుంచి రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ కార్యకలాపాలను విస్తృతం చేస్తారని, షెడ్యూల్ ప్రకారం ప్రకటించిన రోజు నుంచి చేసిన పని ఒక ఎత్తయితే ఇప్పటి నుంచి జరుగబోయే పని ఒక ఎత్తని, మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సరియైన పత్రాలు లేకుండా ఎవరూ నగదు తీసుకెళ్లరాదని, అటువంటి నగదు దొరికినప్పుడు నిబంధనకు అనుగుణంగా ప్రవర్తించాలని, రూ.10 లక్షలు కన్నా ఎక్కువ నగదు దొరికితే ఆదాయ పన్నుల శాఖకు సమాచారం యిచ్చి వారి ద్వారా నగదు జప్తు చేయాలని తెలిపారు. అభ్యర్థులు ర్యాలీల్లో పాల్గొనే వారి వా హనాలను నిశితంగా పరిశీలించాలని, పార్టీ జెండాలతో ఆయా వాహనాల ఖర్చు అభ్యర్థి ఖాతాలో వేయాలన్నారు. స్థా నిక సర్వైలెన్స్ టీమ్‌లు నగరంలోకి ప్రవేశించే మార్గాలన్నింటి వద్ద నిఘా వేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. రేపటి నుంచి అన్ని బృందాలు తిరిగే ప్రతి వాహనానికి జీపీఎస్ డివైస్ అమర్చుతామన్నారు. ప్రచార వాహనాల శబ్ధాలను డెసిబెల్స్ పరంగా లెక్కిస్తామని, పరిమితికి మించి శబ్దం వస్తుంటే వాటిని నియంత్రించాలని, అందుకు తగిన పద్ధతులు కూడా తెలియజేస్తామని ఆర్వో చెప్పారు.

### మానసకు గోరంట్ల అభినందన

కడియం, ఏప్రిల్ 17: ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన కడియానికి చెందిన నర్సరీ రైతు అల్లూరి సతీష్ కు మార్తె దివ్యమానసను ఎమ్మెల్యే గోరంట్ల అభినందించారు.





# పోరు మొదలైంది!



**ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేడే..**

- నేటి నుంచి 25వ తేదీ వరకు కొనసాగనున్న అభ్యర్థుల నామినేషన్లు
- 26న నామినేషన్ల పరిశీలన.. ఉపసంహరణ గడువు ఏప్రిల్ 29
- మే 13న పోలింగ్.. జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికారులు
- అటు ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ నియోజకవర్గ కేంద్రాల్లో
- ఎంపీ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ జిల్లా కలెక్టరేట్‌లో

కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కీలక ఘట్టమైన ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్ తేదీ, ఓట్ల లెక్కింపునకు సంబంధించి అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ జారీచేయనుంది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిందంటే అసలుసిసలు ఎన్నికల వేడి ప్రారంభమైనట్టుగా పార్టీలు భావిస్తాయి. నోటిఫికేషన్ ప్రకారం గురువారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. 26న నామినేషన్ల పరిశీలన చేపడతారు. దాఖలు చేసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు ఏప్రిల్ 29. మే 13న పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అయితే నోటిఫికేషన్ విడుదలైన రోజునుంచే అధికారులు ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ప్రధానంగా అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు ఆ నియోజకవర్గ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి సమక్షంలో నామినేషన్లు దాఖలు చేయాలి. ఎంపీ స్థానానికి పోటీచేసే అభ్యర్థుల నుంచి మాత్రం ఆయా జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ కార్యాలయాల్లోనే నామినేషన్లు స్వీకరిస్తారు. అంటే కాకినాడ జిల్లాకు సంబంధించి కాకినాడ కలెక్టరేట్ లోను, తూర్పుగోదావరి జిల్లాకు రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లోను, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు అమలాపురం లోని కలెక్టరేట్ కార్యాలయంలోనూ ఎంపీ అభ్యర్థులు నామినేషన్లు అందించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కాగా గురువారం నుంచి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అధికారులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు స్వీకరిస్తారు. సెలవుదినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదు. ఒక అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. రెండుకంటే ఎక్కువ నియోజకవర్గాలకు ఒక అభ్యర్థి నామినేషన్లు దాఖలు చేయకూడదు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థితోపాటు అయిదుగురికి మాత్రమే ఆర్వో కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. కాగా జిల్లాలో గురువారం ఎక్కువగా నామినేషన్లు దాఖలు కానున్నాయి. ఆరోజు మంచిరోజు కావడంతో అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు ముహూర్తం నిర్ణయించుకున్నారు.

## నేడు జిల్లాకు జగన్ రాక

- పశ్చిమగోదావరి నుంచి సిద్ధాంతం బ్రిడ్జి దాటి కోనసీమలోని గోపాలపురంలోకి బస్సు యాత్ర
- రాజమహేంద్రవరం మీదుగా రాజానగరం వరకు... రాత్రి బస అక్కడే

రాజమహేంద్రవరం/అమలాపురం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, సీఎం జగన్ గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించ నున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపంలోని తేతలిలో ఉదయం 9 గంటలకు బయలుదేరి సిద్ధాంతం గోదావరి బ్రిడ్జి దాటి కోనసీమ జిల్లా గోపాలపురంలోకి ప్రవేశిస్తారు. అక్కడ నుంచి ఈతకోట, రావులపాలెం, జొన్నాడ, మడికి జంక్షన్, పొట్టిలంక మీదుగా మధ్యాహ్నం 12.30గంటలకు కడియపు లంక చేరుకుంటారు. భోజన విరామం అనంతరం 4 గంటలకు బయలుదేరి బొమ్మూరు జంక్షన్, తాడితోట జంక్షన్, దేవీ చౌక్, సీతంపేట, దివాన్‌చెరువు, రాజానగరం గుండా రోడ్డు షో నిర్వహించి రాత్రి 8.30 గంటలకు రాజానగరం మండలంలోని ఎస్‌టీ రాజాపురం చేరుకొని బస చేస్తారు.

## అనంత.. అరాచకం..



వైసీపీ నాయకుల అరాచకాలకు నిలువెత్తు సాక్ష్యం ఈ ఘటన.. దళితులను ఏం చేసినా మమ్మల్ని ఎవడేం చేస్తాడులే అనే అహానికి నిదర్శనం ఈ ఘటన.. ఇంతకీ ఏమిటా ఘటన అంటే.. దళిత లోకమే నివ్వెరపోయిన విషాద ఘటన.. వైసీపీ పాలనలో అనంత అరాచకాలకు నిలువెత్తు సాక్ష్యం.. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన వద్ద పనిచేసిన దళిత యువకుడైన డ్రైవర్ సుబ్రహ్మణ్యంను 2022 మే 18న నిర్దాక్షిణ్యంగా హత్య చేశాడు.. మమ్మల్ని ఎవడేం చేస్తాడులే అనే ధైర్యం కావొచ్చు.. తన కారులోనే మృతదేహాన్ని తెచ్చి ఇంటి బయట విసిరేశాడు.. నిలదీసిన కుటుంబీకులతో బేరసారాలు నడిపాడు. ఒక దళిత యువకుడి ప్రాణం ఖరీదు ఇంతేనా..!?

దళితులంటే ఎందుకింత పగ.. అలాంటి అనంతబాబును వైసీపీ వెనకేసుకొచ్చింది. హత్య కేసు నమోదవ కుండా పోలీసులపై ఒత్తిడి తెచ్చింది. తీరా బాధితులు, పౌర సంఘాలు రోడ్డెక్కడంతో అనంతబాబు అరెస్టు అయ్యారు. విమర్శలకు జడిచి అనంతబాబును వైసీపీ నుంచి సీఎం జగన్ సస్పెండ్ చేశారు. కానీ కొన్ని రోజుల తర్వాత మళ్లీ అనంతబాబును సీఎం జగన్ పక్కన పెట్టుకుని మరీ పర్యటనలు చేస్తున్నారు. సామర్లకోట మునిసిపల్ ఎన్నికల్లో తమపై పోటీకి దిగాడనే అక్కసుతో గిరీష్‌బాబు అనే దళిత యువకుడిని వైసీపీ నేతలు బెదిరించారు. తప్పుడు కేసులతో వేధించారు. దీంతో 2022 జనవరి 6న స్టేషన్‌లోనే బలవన్మరణానికి పాల్పడ్డాడు. తుని నియోజకవర్గం తొండంగి జాతరలో రెండు సామాజిక వర్గాల ఘర్షణలో దళిత యువకుడు నడిపల్లి రాము మృతి చెందాడు. 2020లో సీతానగరంలో వరప్రసాద్ అనే దళిత యువకుడికి పోలీస్ స్టేషన్‌లోనే కొందరు వైసీపీ నేతలు శిరోముండనం చేయించారు. 2019లో కోడికత్తి కేసులో దళిత యువకుడు శ్రీను జైలు పాలయ్యాడు. ఐదేళ్ల పాటు జైలులోనే మగ్గిపోయాడు.. ఇటీవల విడుదలయ్యాడు. 2023లో కొవ్వూరు నియోజకవర్గం దొమ్మేరులో హోం మంత్రి తానేటి వనిత ఇలాకాలో అధికార పార్టీ ఫ్లెక్సీని చించిశాడనే కారణంతో దళిత యువకుడు మహేంద్రను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కడియంలో వైసీపీ నేతల ఇసుక అక్రమాలను ప్రశ్నించిన దళిత నాయకులపై నాన్‌బెయిలబుల్ కేసులు మోపి వైసీపీ నేతలు వేధిం చారు. ఇలా ఒకటేంటి... వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాలో దళితులపై ఎప్పుడేం ఘోరం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి. మరో పక్క ఉమ్మడి జిల్లాలో ఎక్కడికక్కడ దళితుల భూములపైనా, వారిపైనా పలువురు వైసీపీ నేతలు చేయని దౌర్జన్యం లేదు. పాల్పడని బెదిరింపులు లేవు. వీరంతా న్యాయం కోసం ఐదేళ్లలో ఎన్నోసార్లు ఆయా జిల్లా కలెక్టరేట్లకు న్యాయం కోసం కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నా ఏనాడు వీరికి న్యాయం జరగలేదు. అధికారంలోకి రాక ముందు దళితులపై వైసీపీ కురిపించిన ప్రేమకాస్తా అధికారం వచ్చాక పగగా మారి వారిని వెన్నాడింది. - (కాకినాడ, ఆంధ్రజ్యోతి)

# దళితులపై ఇంత పగా!




## చంపేసి..డోర్ డెలివరీ

కాకినాడ జిల్లా 2022లో అట్టుడికి పోయింది. తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్‌ను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు మే 18న అర్ధరాత్రి కాకినాడ బీచ్ రోడ్డులో హత్య చేసి మృతదేహాన్ని తన కారులో అనంతబాబు డ్రైవర్ ఇంటికే తీసుకెళ్లాడు. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. తీరా కుటుంబీకులు తిరగబడడంతో డబ్బులు ఇస్తా నోరు తెరవొద్దని బెదిరించాడు. ఆగ్రహంతో బాధితులు నిలదీయడంతో కారు వదిలి పారిపోయాడు. మూడు రోజుల తర్వాత హత్య తానే చేశానని పోలీసుల ఎదుట ప్రత్యక్షమయ్యాడు. ముందు అనుమానాస్పద హత్యగా నమోదు చేయడానికి ప్రయత్నించిన పోలీసులు బాధితులు, దళిత సంఘాల ఆందోళనతో హత్య కేసుగా మార్చారు. ఆ తర్వాత అనంతబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించగా బెయిల్‌పై బయటకు వచ్చారు. అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు జగన్ ప్రకటిం చారు. అయితే ఆ తర్వాత అనంతబాబును పక్కన పెట్టుకుని వైసీపీ మంత్రులు, సీఎం బహిరంగ సభలకు హాజరవడంతో అంతా నోరెళ్లబెడుతున్నారు.ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గం ధర్మవరం దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి అనంతబాబు పూలమాల వేశాడు. దళితుడిని చంపి అంబేడ్కర్‌ని అవమానించిన వ్యక్తికి దళితవాడల్లో తిరిగే హక్కులేదని నినాదాలు చేస్తూ దళితులు అతడిని తరిమేశారు.

## వైసీపీ ఐదేళ్ల పాలనలో అనంత దారుణాలు

- ఉమ్మడి తూ.గో.జిల్లాలో దళితులపై దమనకాండ
- చేతికి అధికారం కట్టబెడితే దళితులకు ఫ్యాన్ షాక్‌లు
- హత్యలు.. దౌర్జన్యాలు, దాడులు, శిరోముండనాలు



జగన్ రాజకీయానికి బలైన కోడి కత్తి శ్రీను (ఫైల్)

అమలాపురంలో దగ్ధమవుతున్న మంత్రి విశ్వరూప్ నివాసం (ఫైల్)

## తూర్పున రేగిన అశాంతి...



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రశాంతతకు మారుపేరు తూర్పుగోదావరి.. ఇదీ రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్ల కిందటి వరకూ ఉన్న పేరు.. అటువంటి ప్రశాంత తీరంలో వైసీపీ వచ్చాక అశాంతి రాజ్యమేలింది.సీతానగరం మండలం పెదకొండేపూడి లో ఈ ఏడాది ఫిబ్రవరి 2న తనను ఏలుకో మన్న భార్యకు భర్త శిరోముండనం చేశాడు.ఈ ఘటన వెనుక వైసీపీ నాయకులు ఉన్నారంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్నాడనే కారణంతో 2020 జూలై 20న సీతానగరం మండలం మునికూడలిలో ఇందు గుమిల్లి వరప్రసాద్‌ను సీతా నగరం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులు గుండు గీసేశారు.ఈ కేసులో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిందితులకు అండగా ఉన్నట్టు అప్ప ట్లో దళితులు ఉద్యమించారు. బాధితుడు ప్రసాద్ రాష్ట్రపతికి సైతం ఫిర్యాదు చేశాడు.ఈ కేసులో స్థానిక వైసీపీ నాయకుడితో పాటు ఆరుగురు నిందితులుగా ఉన్నారు. దొమ్మేరులోని వైసీపీ వర్గపోరుకు బొంతా మహేంద్ర అనే యువకుడు బలైపోయాడు. హోం మంత్రి వనితకు సంబంధించిన ఫెక్సీలో తలల భాగాలు కత్తిరించి ఉండడంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానితుడిగా మహేంద్రను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కూర్చోబెట్టారు.తన పరువు పోయిందని తీవ్ర మానసిక క్షోభకు గురైన ఆ దళిత యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కౌలు రైతులు కొమ్మరాజు ముత్యాలు, కొమ్మరాజు సత్యనారాయణ వద్ద తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన గెడ్డం శ్రీను పనిచేస్తుండేవాడు. మూడు రోజులు పనివెళ్లకపోవడంతో కౌలు రైతులు వచ్చి అతడిని ఇంటి వద్ద నుంచి తీసుకెళ్లారు.అదే రోజు సాయంత్రం శ్రీను ఆ రైతుల పొలం వద్ద ఒం టిపై నూలుపోగు కూడా లేకుండా నిర్జీవంగా పడి ఉన్నాడు.ఈ కేసులో పోలీ సుల తీరుపై ఎస్సీఎస్టీ కమిషన్ కూడా మండిపడింది.

## పచ్చని కోనసీమలో కులచిచ్చు..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కోనసీమలో కులచిచ్చు పెట్టారు. రెండేళ్ల కిందట కొత్తగా ఆవిర్భవించిన జిల్లాకు నేరుగా అంబేడ్కర్ పేరు ప్రకటించకుండా అటు దళితులు, ఇటు ఇతర సామాజికవాదులు పరస్పరం ఆందోళనలు చేపట్టే వరకూ ప్రభుత్వం వేచిచూసింది. అనంతరం ప్రభుత్వం అంబేడ్కర్ పేరును ప్రకటించడంతో సున్నితమైన ఈ అంశం కుల ఘర్షణలకు దారితీసింది. దాంతో 2022 మే 22న పేరు మార్పును నిరసిస్తూ అమలాపురం కేంద్రంగా హింసాత్మక ఘటనలు జరిగాయి.పోలీసులపై దాడులతో పాటు రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, ముమ్మిడివరం వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్‌ల నివాసాలకు నిప్పంటించి విధ్వంసం సృష్టించారు. ఆనాటి ఘటనలపై అమలాపురం పోలీసులు సుమారు 250 మందికిపైగా విధ్వంసకారులను గుర్తించారు.ఈ ఘటనల తరువాత జిల్లాలో వైసీపీకి తీవ్ర నష్టం జరిగిందని భావించిన సీఎం జగన్ అమలాపురం అల్లర్ల ఘటన కేసులను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించారు. చివరకు వైసీపీకి చెందిన దళిత నేతలే హైకోర్టును ఆశ్రయించి కేసులు ఎత్తివేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను స్టే విధించారు. అయితే దళిత మంత్రి విశ్వరూప్ ఇల్లు తగులబెట్టిన వారిపై కేసులు ఉపసంహరించిన జగన్ ప్రభుత్వ తీరుపై దళిత సంఘాలు ఇప్పటికీ గుర్రుగానే ఉన్నాయి. రాబోయే ఎన్నికల్లో దళితుల నుంచి ఈ ప్రభావం వైసీపీకి గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా.



రాజీనామా పత్రాలను చూపుతున్న కొఠారు అశోక్‌బాబా, లకంసాని శ్రీనివాసరావు

## వైసీపీకి సినీ నిర్మాత అశోక్‌బాబా రాజీనామా

**నేడు టీడీపీలో చేరిక..**

**ఖాళీ అవుతున్న కొవ్వూరు వైసీపీ**

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి)/ కొవ్వూరు: సినీ నిర్మాత, రాష్ట్ర కమ్మ కార్పొ రేషన్ డైరెక్టర్ కొఠారు అశోక్‌బాబా వైసీపీ ప్రా థమిక సభ్యత్వానికి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి బుధవారం రాజీనామా చేశారు.గురువారం కొవ్వూరులో టీడీపీ నేత పెండ్యాల అచ్చిబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరనున్నారు. వైసీపీ అధినేత సీఎం జగన్ తూర్పుగోదావరి జిల్లాలో గురువారం రోడ్ షోకు రానున్న సందర్భంలో అశోక్‌బాబా రాజీనామా జగన్‌కు పెద్దషాకే. చాగల్లుకు చెందిన అశోక్‌బాబా వైసీపీ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీలో ఉన్నారు. కాని మంత్రి తానేటి వనిత గ్రూపులు పెట్టడం, నియోజకవర్గంలో అభివృద్ధి చేయక పోవడంతో ఆయన పార్టీకి దూరమైనట్టు చెబుతున్నారు. జోరు, తుంటరి వంటి సినిమాలకు నిర్మాతగా వ్యవహరించిన అశోక్‌బాబా, ప్రస్తుతం వెబ్ సిరీస్ ప్లానింగ్‌లో ఉన్నారు. హైదరాబాద్‌లో కన్‌స్ట్రక్షన్ రంగంలో బిజీగా ఉన్నారు. వైసీపీలో ఉండి ప్రజలకు ఏమీ చేయలేని పరిస్థితిలో టీడీపీలో చేరుతున్నట్టు చెప్పారు. ఆయనది మొదటి నుంచి కాంగ్రెస్ కుటుంబం. తండ్రి రామారావు పదేళ్లపాటు చాగల్లు సర్పంచ్‌గా, సొసైటీ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఆయన పెదతండ్రి మునేశ్వరరావు ఎంపీపీగా కూడా పనిచేశారు. అశోక్‌బాబా 2014లో జడ్పీటీసీగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. కానీ 2019లో మంత్రి తానేటి వనిత గెలవడంలో కీలక పాత్ర పోషించారు.చాగల్లులోని సుమారు 20ఏళ్ల నాడు నిర్మించిన ఇందిరమ్మకాలనీకి కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తామని,అక్కడ గతంలో వచ్చే బస్సు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి,కనీసం రోడ్డు కూడా వేయించలేకపోయానని, అందుకే రాజీనామా చేసినట్టు ఆయన ప్రకటిం టచారు.ఆయనతో పాటు జిల్లా వ్యవసాయ సలహాదారు లకంసాని శ్రీనివాసరావు రాజీనామా చేశారు. వైసీపీ వైఖరి గ్రూపులుగా విడిపోయిన కొవ్వూరులో వైసీపీ ఖాళీ అవుతోంది.ఇటీవల ఎంపీపీ, ఇద్దరు సర్పంచ్‌లు, కొందరు బీసీ నేతలు పార్టీకి రాజీనామా చేశారు.

## జాతర చూసేందుకు వస్తే చంపేశారు..



తొండంగి, ఏప్రిల్ 17: కాకినాడ జిల్లా తొండంగి గ్రామానికి చెందిన రాజు శృంగవృక్షంలో జాతర చూసేందుకు గతేడాది మార్చి 22న తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. ఆ రోజు రాత్రి జాతరలో స్థానిక యువకులతో అతడికి జరిగిన స్వల్ప ఘర్షణ జరిగింది.స్థానిక యువకులు పెద ఎత్తున వచ్చి రామును కొట్టడంతో అతడు మృతిచెందాడు. దీంతో పాటు పలువురు దళిత యువకులకు గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీకి చెందిన వారే యువకుడి మృతికి కారణమయ్యారని వారి పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని దళిత సంఘాలు ఆందోళన చేశాయి. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ దళిత నాయకులు చెపుతున్న పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని పోలీసులను ఆదేశించడంతో మరో ఇద్దరి పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

## 18 మంది దళిత యువకులపై రాజద్రోహం కేసు



రావులపాలెం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్త పేట వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వగ్రామం గోపాలపురం.2022 జూలై 5న గోపాలపురంలోని అన్నపూర్ణ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో టిఫిన్ ప్లేట్లపై అంబేడ్కర్ బొమ్మ ముద్రించి ఉండడాన్ని దళిత యువకులు గుర్తించి యజమానిని ప్రశ్నించడంతో ఘర్షణ జరిగింది. రెండు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పోలీసులపై ఒత్తిడి తేవ డంతో 18 మందిపై రాజద్రోహం కేసు నమోదు చేసి జైలుకు పంపారు.కొద్ది రోజుల తర్వాత గోపాలపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'లో పాల్గొ నేందుకు వెళ్లిన జగ్గిరెడ్డికి వ్యతిరేకంగా దళిత మహిళలు నినాదాలు చేశారు. మా పిల్లలను జైలుకు పంపి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వచ్చారని నిలదీశారు.

### జగన్ రాజకీయ జీవితానికి.. దళితులే సమాధి కడతారు



జగన్ రాజకీయ జీవితానికి దళితులే సమాధి కడతారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక డాక్టర్ సుధాకర్ దగ్గర నుంచీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవరు వీధి సుబ్రహ్మణ్యం వరకూ దళితులపై తీవ్రంగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. దళితులను వంచించడంలో వైసీపీ శక్తివంచన లేకుండా పని చేసింది. జగన్‌కి దళితులు ఓటు అనే ఆయుధంతో గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.

**- ముప్పాళ్ల సుబ్బారావు, ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**

## తోటకు శిక్ష.. వైసీపీకి షాక్

తోట త్రిమూర్తులు పరిచయం అక్కర్లేని పేరు ఇది.. ఎందుకంటే ఆది నుంచి వివాదాలే.. అటువంటి నాయకుడు ప్రస్తుతం వైసీపీ మండపేట అభ్యర్థిగా బరిలో ఉన్నారు.. 27 ఏళ్ల కిందట ఆయన చేసిన నిర్వాకం తెలిస్తే దళితులు ఆగ్రహంతో ఊగిపోతారు. 1996లో రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇండింపెడెంట్‌గా పోటీ చేసిన సమయంలో తనకు వ్యతిరేకంగా పనిచేశారన్న ఒకే ఒక్క కారణంతో వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు యువకులను హింసించి.. ఇద్దరికి శిరోముండనం చేయించారు. ఈ కేసులో విశాఖ కోర్టు మంగళవారం తోట త్రిమూర్తులుకు 18 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. దీంతో ఎన్నికల వేళ వైసీపీకి షాక్ తగిలింది.



శిరోముండనం బాధితులు(ఫైల్)



తోట త్రిమూర్తులుతో జగన్

## వేప చెట్టుకు.. పాలు కారాయ్!



వేప చెట్టుకు పాలు కారడమా.. ఇదెక్కడి చోద్యం.. కలియుగంలో అంతా మాయ.. ఇది కొవ్వూరు దొమ్మేరు రహదారిలో రోడ్డు పక్కన ఉన్న వేపచెట్టు.. బుధవారం ఉదయం నుంచి ఇలా పాలు కారుతున్నాయి. దీంతో స్థానికులు పసుపు రాసి పూజలు చేశారు.

- కొవ్వూరు

## రాములోరి కల్యాణం.. కమనీయం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : భక్తులు పెళ్లి పెద్దలై రాములోరి కల్యాణాన్ని బుధవారం కన్నుల పండువగా చేశారు. శ్రీరామ నవమి శోభతో వాడ వాడలా ఆధ్యాత్మిక సందడి వెల్లివిరిసింది. ముత్యాల పందిరిలో సీతమ్మ మెడలో రాములోరు మాంగల్యధారణ చేశారు. ఈ ఘట్టాన్ని తిలకించిన భక్తకోటి 'జై సీతారామ్' అని నినదిస్తూ మురిసిపోయారు. జిల్లావ్యాప్తంగా సీతారాముల కల్యాణాన్ని భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాజమహేంద్రవరం సీతంపేట రామాలయంలో పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు. జాంపేట రిజర్వు పోలీసు లైనులోని శ్రీ కోదండ రామాలయ ప్రాంగణంలో ఎస్పీ జగదీశ్, ఆయన సతీమణి హేమ సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించి పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు.అనంతరం పానకం, వడపప్పు ప్రసాదం వితరణ చేశారు. అడిషనల్ ఎస్పీలు పి.అనిల్ కుమార్, ఎస్‌ఆర్ రాజశేఖర్‌రాజు, ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు రఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయి మహేశ్, డీఎస్పీలు,సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సీతంపేటలో పురందేశ్వరి పూజలు



రిజర్వు పోలీస్ లైన్ రామాలయంలో ఎస్పీ దంపతుల పూజలు

## మద్య నిషేధంచేయని జగన్‌కు ఓటు అడిగే హక్కు లేదు : మాలే



విలేకరులతో మాట్లాడుతున్న మహిళా నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 17: ఎందరో మహిళల తాళిబొట్లు తెగిపోవడానికి కారకుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ బహిరంగంగా మహిళలకు క్షమాపణ చెప్పి అప్పుడు జిల్లాలో అడుగుపెట్టాలని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి డిమాండ్ చేశారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని మాట ఇచ్చి రాష్ట్రంలో చీప్ లిక్కరు, కల్తీ మద్యాన్ని జగన్ ఏరులై పారించాడన్నారు.గత ఎన్నికల ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తేనే మిమ్మల్ని ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్ ఇప్పుడు సిగ్గులేకుండా ఎందుకు మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నావని ప్రశ్నించారు. రోజువారి మద్యం తాగే కూలీలు ఇప్పుడు జే బ్రాండ్ల పుణ్యామంటూ లివర్లు పాడై అనారోగ్యాలతో ఉన్నారన్నారు. మహిళలను ఓట్లు అడిగే హక్కు జగన్‌కు లేదన్నారు. మహిళలను దగా చేసిన జగన్‌కు ఓట్లతోనే బుద్ధిచెబుతామన్నారు. సమావేశంలో తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ద్వారా పార్వతి సుందరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకల నిర్మల, ఈశ్వరి, మీసాల నాగమణి, కానేటి కృపామణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సర్పంచ్‌ల సమస్యలపై సమావేశం

కొవ్వూరు, ఏప్రిల్ 17 : సర్పంచ్‌ల సమస్యలపై ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు బుధవారం తెలిపారు. ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ సర్పంచ్‌ల సంఘం పిలుపుమేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల సమైఖ్య ఆధ్వర్యంలో గురువారం రాజమహేంద్రవరం రివర్ బే హోటల్‌లో ఉదయం 10 గంటలకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అఖిలపక్ష సమావేశం జరుగుతుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేయడమే కాకుండా గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించిందన్నారు.సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలన్నారు.

# తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

## కుట్ర పాలనకు చరమగీతం పాడండి

**టీడీపీ-జనసేన-బీజేపీ గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి**



యాదవోలులో టీడీపీలో చేరిన కార్యకర్తలతో మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, ఏప్రిల్ 17: రాష్ట్రంలో జగన్ కుట్ర పాలనకు చరమగీతం పాడి సుపరిపాలన అందించే టీడీపీకి పట్టం కట్టాలని టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. యాదవోలులో బుధవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో 20ఏళ్లు వెనక్కి పోయిందని, నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణరాజు మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఆర్థిక నేరస్తుడని, రాష్ట్రాన్ని అన్ని విధాల దోచుకుతున్నాడని విమర్శించారు. ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందరేశ్వరిని, నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజును గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రాంబాబు ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నుదురుమాటి శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, పెనుమత్స సుబ్బరాజు, గంగరాజు, అనిశెట్టి శ్రీనివాస్, యర్రగుళ్ళ అంజి, కోలా రామకృష్ణ పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థులను గెలిపించాలి

**టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి**



కొవ్వూరు గౌతమీనగర్‌లో ప్రచారం చేస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 17: భావితరాల భవిష్యత్ కోసం కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని 17వ వార్డులో అర్బన్‌బ్యాంకు ఛైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ ఇంటి నుంచి ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో బుధవారం ముప్పిడి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ వంటి అంశాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ వైఎస్ జగన్ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఐదేళ్లుగా రాష్ట్రాభివృద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులను దారి మళ్లించి దోచుకోవడం, దాచుకోవడం తప్ప చేసిందేమి లేదన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమకేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారన్నారు. వైసీపీ రాక్షస పాలనను అంతమొందించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మద్దిపాటి సత్యనారాయణ, బర్ల శ్రీనివాసరావు, జనసేన నాయకులు డేగల రాము, కె.నవ్య, బీజేపీ నాయకులు బోడపాటి ముత్యాలరావు, ఎం.రామచంద్రరావు పాల్గొన్నారు.

### బి.ఫారం అందుకున్న కందుల దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 17: టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జనసేన నాయకుడు కందుల దుర్గేష్ బుధవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా బీఫారమ్ అందుకున్నారు. ఈ నెల 19వ తేదీ శుక్రవారం ఉదయం దుర్గేష్ నిడదవోలులోని జనసేన కార్యాలయం నుంచి పాదయాత్రగా వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నట్టు పార్టీ కార్యాలయం తెలిపింది.

### కూటమి కార్యకర్తల ప్రచారాలు

పెరవలి, ఏప్రిల్ 17: ఉమ్మడి అభ్యర్థులకు మద్దతుగా మండలంలోని ఆయా గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ప్రచారాలు ముమ్మరంగా నిర్వహించారు. రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి పురందరేశ్వరికి కమలం, ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్‌కు గాజు గ్లాసు గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కానూరు, తీపర్రు, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, కాకరపర్రు, పెరవలి, మల్లేశ్వరం, ఖండవల్లి, తదితర గ్రామాల పరిధిలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

### నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

గోపాలపురం, ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ ముఖ్య కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. కార్యాలయ ప్రాంగణ పరిధిలో సెక్షన్ 144 అమలులో ఉండడంతో నిర్దేశించిన వ్యక్తులు తప్ప ఇతరులెవరూ కార్యాలయ ఆవరణలో ప్రవేశించకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పందిర్లు వేసి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

### భవనం నుంచి జారి కార్మికుడి మృతి

గోపాలపురం, ఏప్రిల్ 17: పండగపూట విషాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తూ జారి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ వివరాల ప్రకారం.. గోపాలపురంలోని కుమ్మలకుంట గ్రామానికి చెందిన షేక్ యాసిన్ (45) తాపీ పని చేస్తుంటాడు. బుధవారం ఉదయం భీమోలు గ్రామంలో ఓ ఇంటికి నిర్మాణ పనులు చేస్తుండగా భవనం పైనుంచి ప్రమాదవశాత్తూ జారి కిందపడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. హుటాహుటిన గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ యాసిన్ మృతి చెందాడని అన్నారు. మృతుడి తండ్రి బెజ్జం సాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

### అదుపు తప్పి.. తవుడు లారీ బోల్తా

గోపాలపురం, ఏప్రిల్ 17: గోపాలపురం శివారు కనకదుర్గమ్మ ఆలయం వద్ద జాతీయ రహదారిపై లారీ అదుపు తప్పి బోల్తా పడింది. జంగారెడ్డిగూడెం వైపు నుంచి వస్తున్న తవుడు లారీ రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్పగాయాలయ్యాయి.

### గొల్లగూడెంలో గడ్డివాము దగ్ధం

దేవరపల్లి, ఏప్రిల్ 17: మండలంలోని గొల్లగూడెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధమై రూ.50 వేల ఆస్తి నష్టం జరిగింది. గ్రామంలో గడా శ్రీహరికి చెందిన గడ్డివాము షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాముకు మంటలు వ్యాపించాయి. కొవ్వూరు అగ్నిమాపక అధికారి ఏవీఎస్ఎస్ వేణు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

### వీరంపాలెంలో వాహన తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సెబ్ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

దేవరపల్లి, ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో వీరంపాలెం టోల్ ప్లాజా వద్ద బుధవారం వాహనాలను సెబ్ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి తనిఖీలు చేపట్టారు. అలాగే చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. మద్యం, నగదు, అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్టు వేయాలని, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆమె ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో సీఐ కేవీ స్వామి, ఎస్ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'వైసీపీ పాలనలో చేనేత రంగం నిర్వీర్యం'

కడియం, ఏప్రిల్ 17: చేనేత రంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి నాన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి కుమారుడు హితేష్ బుధవారం మండలంలోని దుళ్లలో టీడీపీ, జనసేన, నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ చేనేత సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వదిలేసిందన్నారు. చేతకాని పాలనతో సొసైటీలు నష్టపోయాయన్నారు. టీడీపీ హయాంలో చేనేతకు నూలు, రంగుల సబ్సిడీ, సహాయనిధి, పొదుపు నిధి, రంగులు, మరమగ్గాలకు సాయం అందించామన్నారు.

# కల్యాణ వైభోగమే..

- ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- పలుచోట్ల వైభవంగా సీతారాముల కల్యాణం
- ఆలయాల వద్ద పానకం, ప్రసాదాలు వితరణ



కొవ్వూరు న్యాయ గణపతి మందిరం వద్ద శ్రీసీతారాముల కల్యాణం దృశ్యం

కొవ్వూరు, ఏప్రిల్ 17: శ్రీరామ నవమి వేడుకలను పలు చోట్ల అత్యంత భక్తి శ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. రామాలయాలు శ్రీరామ నామ స్మరణతో హోరెత్తాయి. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. కొవ్వూరు పాతపేట రామాలయంలో ఆలయ కమిటీ సభ్యుడు గండ్రోతు కోదండ రామారావు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం చేపట్టారు. అలాగే 13వ వార్డు దగ్గువారి వీధి, మెరకవీధి, గోష్పాదక్షేత్రంలోని సుందరేశ్వర స్వామి ఆలయం, 11వ వార్డు, 23వ వార్డు, ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ క్లబ్, సుబ్రహ్మణ్య స్నానఘట్టం, బసివిరెడ్డిపేట తదితర ప్రాంతాలతోపాటు, మండలంలోని పలు గ్రామాల్లోని కోదండరామాలయాల వద్ద శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని రాములోరి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు పానకం, వడ పప్పు, చలివిడి, పులిహోర ప్రసాదాలను పంపిణీ చేశారు. మెరకవీధి రౌండ్ రామాలయం, ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ క్లబ్, రక్షక గణపతి ఆలయాల వద్ద అన్నదానం చేశారు.

### కొవ్వూరులో శ్రీరామ శోభాయాత్ర

శ్రీరామ నవమి సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కొవ్వూరులో శోభాయాత్ర చేపట్టారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధి కర్రి గోలింగాచారి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పట్టణ పురవీధుల్లో జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ మోటారుసైకిళ్లపై ఊరేగారు. బస్టాండ్ సెంటర్ నుంచి రోడ్డు కం రైలు బ్రిడ్జిపై మీదుగా రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వరకు శోభాయాత్ర చేపట్టారు. అనంతరం బారీ బహిరంగ సభలో పాల్గొన్నారు.



తాళ్లపూడి మదన గోపాలస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం

**నిడదవోలు:** నిడదవోలులోని రాయిపేట, యాదవుల వీధి, కాపుల వీధి, పాటి మీద రామాలయాలతోపాటు మండలంలోని ఉనకరమిల్లి, కాటకూటేశ్వరం, విజ్జేశ్వరం, గోపవరం, సమిశ్రగూడెం గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



నిడదవోలు రాయిపేటలోని రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి

**తాళ్లపూడి:** తాళ్లపూడి మదనగోపాల స్వామి ఆలయంలో అప్పన చంద్రధర గుప్త దపంతులు, కాపుల రామాలయం వద్ద చక్కా నాగేశ్వరరావు దంపతులు, షిర్డీసాయి ఆలయంలో కొండూరి రాజా దంపతులు, మైగాపుల వారి వీధిలో మైగాపుల సత్యనారాయణ దంపతులు సీతారాముల కల్యాణోత్సవాలను నిర్వహించారు. వేగేశ్వరపురంలో గోదావరి రేవులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ నిర్మాణకర్తలు సంకాబత్తుల కుటుంబీకులు సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**దేవరపల్లి:** మండలంలోని దేవరపల్లి, యర్నగూడెం, దుద్దుకూరు, చిన్నాయిగూడెం, యాదవోలు గ్రామాల్లో రామాలయాల వద్ద సీతారాముల కల్యాణాలను నిర్వహించారు. కల్యాణ ఘట్టాలను అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీలు భక్తులకు పానకం, తీర్థ ప్రసాదాలు అందజేశాయి. దేవరపల్లి షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ కొదండ రామాలయానికి ముత్యాల తలంబ్రాలు అందజేసింది.



దేవరపల్లి రామాలయం వద్ద శ్రీనివాస కల్యాణం

**గోపాలపురం:** మండలంలోని పలు గ్రామాల్లో కోదండ రామస్వామి ఆలయాల్లో మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

**నల్లజర్ల:** మండలంలోని కవులూరులో కరుటూరు ముత్యం, మంచిరాజు వెంకటలక్ష్మి దంపతులు పూజాధికాలు నిర్వహించారు. అనంతరం ముత్యం కుమారుడికి రూ.3,900 నాణేలతో తులా భారం వేశారు. అలాగే చీపురుగూడెంలో చెల్లు హరిబాబు దంపతులు పూజలు చేపట్టారు. ఆలయాల వద్ద పానకాలు భక్తులకు పోశారు.

**పెరవలి:** మండలంలోని కానూరు, నడిపల్లి, తీపర్రు, కాకరపర్రు, అజ్జరం, పెరవలి, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, పి.వేమవరం గ్రామాల్లో రామాలయాలను అందంగా ముస్తాబు చేసి శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. శ్రీరాముని కల్యాణం వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా పానకాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు రామాలయాల వద్ద అన్నసమారాధన చేపట్టారు. కోలాట భజన కార్యక్రమాలు నిర్వహించారు.

**ఉండ్రాజవరం:** మండలంలోని ఉండ్రాజవరం, తాడిపర్రు గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించారు. పాలంగి షిర్డీసాయిబాబా ఆలయంలో ఉదయం సీతారాముల కల్యాణం, సాయంత్రం చందనోత్సవం బాణసంచా, వివిధ వాయిద్యాలతో వైభవం జరిపారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు వద్ద పానకలు పోశారు. కాల్ధరి, వేలివెన్ను, సూర్యారావుపాలెం, చివటం, మోర్త శ్రీరామ నవమి వేడుకలు జరిపారు.



పెరవలి : తీపర్రులో రామాలయం వద్ద బాల బాలికల సందడి

# ఉత్తుత్తి బటన్లు నొక్కే ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి

- టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు

తాళ్లపూడి, ఏప్రిల్ 17: మన పిల్లలు, గ్రామం, రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఉత్తుత్తి బటన్లు నొక్కే బటన్ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త పెండ్యాల అచ్చిబాబు తెలిపారు. బుధవారం టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు సామిల్లులో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. జగన్‌మోహనరెడ్డి రాజకీయ నాయకుడు కాదని ఆయన మంచి వ్యాపారవేత్త అని, ఆయన ప్రజలకు బటన్ నొక్కి రూ.10 పంచిపెట్టి రూ.100 తిరిగి తీసుకునే వ్యక్తి అని అన్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి పథకాలు అమలు చేసేవారని, జగన్‌రెడ్డి అప్పులు చేసి ఇస్తున్నారన్నారు. సైకిల్ గుర్తుపై ఓటేసి, ఎమ్మెల్యే అభ్యరిథ ముప్పిడి వెంకటేశ్వరరావును, కమలం గుర్తుపై ఓటేసి దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని కోరారు. అనంతరం స్థానిక కళింగపేటలో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అల్లూరి విక్రమాదిత్య, గాయిత్రీ వెంకటేశ్వరరావు, ఇందుగుల రామకృష్ణ, కలిశెట్టి సన్యాసినాయుడు, ఇల్లూరి బాబ్జి, అయితం మణికంఠ, కొఠారు వెంకట్రావు, కైగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తాళ్లపూడి కార్యక్రమంలో మాట్లాడుతున్న పెండ్యాల అచ్చిబాబు

### టీడీపీలో చేరిన 80 బీసీ కుటుంబాలు

కొవ్వూరు, ఏప్రిల్ 21: వైసీపీ ప్రభుత్వ విధానాలు నచ్చక విసిగి కొవ్వూరు బ్రిడ్జిపేట వాంబేకాలనీ వాసులు టీడీపీలో చేరినట్టు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి తెలిపారు. నియోజకవర్గ బీసీ నాయకుడు అర్లిల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి సమీపంలో వాంబేకాలనీకి చెందిన 80 బీసీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ద్విసభ్య కమిటీ సభ్యులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ కొవ్వూరు వాంబేకాలనీలో తాగునీరు, పారిశుధ్య సమస్య అధికంగా ఉన్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అదనంగా వాటర్‌ట్యాంకు నిర్మించడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, మల్లాడి పోసిబాబు, మల్లాడ పల్లయ్య డొక్కా జగన్నాథం, దువ్వల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

కొవ్వూరు, ఏప్రిల్ 17: రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే కేంద్రంలోను, రాష్ట్రంలోను కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని నియోజకవర్గ అభ్యర్థి అరిగెల అరుణకుమారి అన్నారు. మండలంలోని పంగిడిలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరించారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలన్నారు. కార్యక్రమంలో గెడ్డం సాయిబాబా, కొణిదల శ్రీనివాస్, బి.రాంబాబు, పాలకుర్తి ప్రభాకర్, జాన్, సత్యనారాయణ, వెంకట్రావు, నాగాంజనేయులు, రాజు పాల్గొన్నారు.

**దేవరపల్లి:** కాంగ్రెస్ పార్టీతోనే దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని పార్టీ నియోజకవర్గ అభ్యర్థి మార్టిన్ లూథర్ అన్నారు. మండలంలోని దుద్దుకూరులో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జ్యేష్ఠ సతీష్, కాకర్ల శ్రీహరిబాబు, వెలగా రామకృష్ణ, పిట్టా రామారావు, ఎం.సోమ రాజు, గుత్తికొండ సూరిబాబు, లంకా చిన్నబ్బులు పాల్గొన్నారు.

### 'సంక్షేమ పథకాలు పేరుతో దోపిడీ'

పెరవలి, ఏప్రిల్ 17: బీఎస్పీ నియోజకవర్గ అభ్యర్థి గుమ్మాపు చిత్రసేను కాకరపర్రులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు పేరుతో సహజ సంపదలను దోపిడీ చేసిందని ఆరోపించారు. ఇసుక, మట్టి, విపరీతంగా తవ్వి అక్రమ ఆదాయం గడించారన్నారు. కార్యక్రమంలో నల్లి రమేష్, బి.ఆశీర్వాదం, కప్పల ఇస్రాయేలు, గుమ్మాపు వాసు, చల్లాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

### వృద్ధాశ్రమానికి హాస్పిటల్ బెడ్ అందజేత



కొవ్వూరు, ఏప్రిల్ 17: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వీ202ఏ రీజియన్ ఛైర్మన్ జయవరపు లక్ష్మి అన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు దేవతు కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వూరులోని వాత్సల్యా వృద్ధాశ్రమానికి క్లబ్ క్యాబినెట్ సెక్రటరీ గ్రంది గంగాధర ప్రవీణ్ తన తండ్రి వీరభద్రస్వామి జ్ఞాపకార్థ హస్పిటల్ బెడ్‌ను బహుకరించారు. అన్నదానం చేశారు. అనంతరం అచ్చాయమ్మకాలనీలో పేదలకు కంకటాల వెంకట్రాజు సహకారంతో పౌష్టిక పదార్థాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రాఘవ రమాకాంత్, సత్యవరపు గురునాధ్, కామేశ్వరరావు, గంగధర ప్రవీణ్, మద్దుల సత్యనారాయణ, నాశం శ్రీనివాస్, మద్దుల సోమరాజు పాల్గొన్నారు.

### నామినేషన్ దాఖలుకు తరలిరండి

గోపాలపురం, ఏప్రిల్ 17: కూటమి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులంతా వేలాదిగా తరలి రావాలని టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 18గ్రామ పంచాయతీల్లోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

### పెద్దేవంలో చలివేంద్రం

తాళ్లపూడి, ఏప్రిల్ 17: మండలంలోని పెద్దేవం సినిమాహాల్ సెంటరులో ఆటో యూనియన్ నాయకులు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సభ్యులు, విక్రమ్ ఎలక్ట్రికల్, సాయిగంగా వాటర్ ప్లాంట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నవచైతన్య ఆటో యూనియన్ అధ్యక్షుడు మల్లిపూడి హనుమంతు, గణసాల ఆకాష్, గెడ్డం విజయభాస్కరరావు, కొనగాల సత్యనారాయణ, మానెల్లి రమేష్ పాల్గొన్నారు.

### దుర్మార్గ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

**ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు**



సమావేశంలో హరిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చాగల్లు, ఏప్రిల్ 17: దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు అన్నారు. నెలటూరులోని శ్రీసీతారామ స్వామి కళ్యాణ మండపంలో జరిగిన టీడీపీ-జనసేన-బీజేపీ మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిల నామినేషన్ల దాఖలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా హరిబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించి కేక్ కటింగ్ చేయించి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, యడ్లపల్లి రకారావు, మద్దిపాటి వీరరాఘవులు, నందిగం శ్రీను, ఈడుపుగంటి మురళి, జొన్నకూటి వెంకాయమ్మ, బీజేపీ నాయకుడు తాళ్ళూరి వరప్రసాద్, జనసేన నాయకులు ఉప్పులూరి చిరంజీవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీసీతారాముల కల్యాణ వేడుకలు



చాగల్లు పాటెమ్మ పేటలోని రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, ఏప్రిల్ 17: మండలంలోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. చాగల్లులో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో కల్యాణ వేడుకలు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం జరిపి వీధుల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పాటిమ్మపేట, కొత్తపేట ప్రాంతాల్లోని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి.

### నిఘా బృందాలు సమష్టిగా పనిచేయాలి

సమీక్ష సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఆర్వో దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 17: నిఘా బృందాలు సమష్టిగా పని చేయాలని రాజమహేంద్రవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.దినేష్‌కుమార్ అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన తనిఖీ బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 18నుంచి రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ కార్యకలాపాలను విస్తృతం చేస్తారని, షెడ్యూల్ ప్రకారం ప్రకటించిన రోజు నుంచి చేసిన పని ఒక ఎత్తయితే ఇప్పటి నుంచి జరుగబోయే పని ఒక ఎత్తని, మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సరియైన పత్రాలు లేకుండా ఎవరూ నగదు తీసుకెళ్లరాదని చెప్పారు.

### అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

కొవ్వూరు, ఏప్రిల్ 17: ప్రమాదాలు జరగకుండా ప్రతిఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కొవ్వూరు అగ్నిమాపక శాఖాధికారి ఏవీఎస్ఎస్ఎస్ వేణు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం కొవ్వూరులోని అపార్ట్‌మెంటులో అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ లీకైనప్పుడు తీసుకోవలిసిన జాగ్రత్తలను వివరించారు. అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించడం, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పి.అప్పారావు, సీహెచ్‌వీవీ గంగాధరరావు, ఎం.రవికుమార్, ఎన్.రామకృష్ణ, కె.ధనుంజయరావు, వై.రాంబాబు పాల్గొన్నారు.

### కొవ్వూరులో ఫారం-12 సేకరణ కేంద్రాలు

**రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ**

కొవ్వూరు, ఏప్రిల్ 17: ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బంది కోసం ఫారం-12 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఇతర పోలింగ్ అధికారులు (ఓపీవో), మైక్రో అబ్జర్వర్లుగా నియమితులైన వారు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకునేందుకు నియోజకవర్గ పరిధిలోని కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయాలు, కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఫారం-12 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు ఉన్న వారు ఫారం-12 పూర్తిచేసి, ఎన్నికల ఉత్తర్వుల కాపీ జిరాక్స్, ఓటరు గుర్తింపు కార్డు, ఆదార్ జిరాక్స్, 2 తాజా పాస్‌పోర్టు సైజు ఫోటోలు ఏప్రిల్ 22వ తేదీలోగా అందజేయాలని సబ్ కలెక్టర్ చెప్పారు.

### కోట సత్తెమ్మ ఆలయంలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆలయ సహాయ కమిషనర్ సూర్యప్రకాష్

నిడదవోలు, ఏప్రిల్ 17: కోటసత్తెమ్మ భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ఆవరణలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్ వి. హరి సూర్యప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యుడు గాజుల రంగారావు, ప్రధానార్చకుడు అప్పారావుశర్మ తదితరులు పాల్గొన్నారు.

### సినిమా గైడ్

**కొవ్వూరు**

| | |
|---|---|
| యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1 | లవ్‌గురు |
| వై.స్క్రీన్2 | ఫ్యామిలీ స్టార్ |
| దేవిశ్రీ(గాయత్రి) | మంజుమ్మల్ బాయ్స్ |
| అనన్య | డీజే టిల్లు-2 |

**నిడదవోలు**

| | |
|---|---|
| వీ మ్యాక్స్ | డీజే టిల్లు-2 |
| రాధాకృష్ణ | ఫ్యామిలీ స్టార్ |
| శ్రీగణపతి | గీతాంజలి మళ్లీ వచ్చింది |

**దేవరపల్లి**

| | |
|---|---|
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | ఫ్యామిలీ స్టార్ |
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | ఫ్యామిలీ స్టార్ |

**నల్లజర్ల**

| | |
|---|---|
| శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1 | భీమా |
| స్క్రీన్ 2 | ప్రేమలు |
| శ్రీనివాస | గామి |